
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 30, జనవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## నేటి నుంచే రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రారంభం

- మొదటి దఫాలో పౌరులకు అందుబాటులోకి 161 సేవలు
- వాట్సాప్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి:** వాట్సాప్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రభుత్వం నేటి నుంచి అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో సీఎం సమీక్షించారు. మొదటి విడతగా పౌరులకు 161 సేవలను ప్రభుత్వం అందించనుంది.

ఈ మేరకు సీఎం చంద్రబాబుకు అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. వాట్సాప్ ద్వారా సేవలను పొందాలనుకునే వారు ఏ విధంగా ఆప్షన్‌లను ఎంచుకుంటారనే దానిపై సీఎంకు అధికారులు వివరించారు. రెండవ విడతలో మరిన్ని సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుంది. మొదటి విడతలో భాగంగా

# టీడీపీలో కట్టుదాటుతున్న క్రమశిక్షణ?

- లక్ష్మణరేఖ దాటుతున్న తమ్ముళ్లు
- బహిరంగ బెదిరింపుల పర్వం
- జగన్ బెదిరింపుల సిలబస్ మార్చుకోని వైసీపీ మాజీలు
- ఇంకా టీడీపీ స్కూల్ పద్ధతులు పాటించని ధిక్కార పర్వం
- నియోజకవర్గాలను తండ్రి, భార్య, భర్త, కొడుకు, అన్న, పీఏల పెత్తనానికి వదిలేసిన తీరు
- భయపడటం మానేశారా?
- కట్టడి చేయకపోతే కష్టమంటున్న పార్టీ సైనికులు
- వివాదాలు రాస్తే రైలు పట్టాలపై పడుకోబెట్టి చంపుతా
- ఆధారాలు లేకుండా రాస్తే తాటతీస్తా
- మీడియాకు గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హెచ్చరిక

(మార్తి సుబ్రహ్మణ్యం)

మహానాడు ఫోకస్



క్రమశిక్షణకు తెలుగుదేశం మారుపేరు. వైసీపీ నాయకత్వానికి అది పూర్తి భిన్నం. పార్టీ ప్రముఖులు ఎన్ని దౌర్జన్యాలు చేసినా, ఇతరులపై ఎన్ని దాడులు చేసినా జగనన్న లెక్క .. చంద్రన్న గమ్మున నవ్వుతూ కూర్చోరు. తన సమక్షంలోనే ప్రత్యర్థులను బూతులతో తిడుతుంటే.. జగనన్న మాదిరిగా చిరునవ్వులు చిందించరు. జగన్ మాదిరిగా పార్టీ నేతలపై మీడియాలో వ్యతిరేక వార్తలు వచ్చినా పట్టించుకోకుండా బేఫర్వాగా ఉండరు. వారిని పిలిచి హెచ్చరిస్తారు. తీరు మార్చుకోమని మందలిస్తారు. దానికంటే ముందు.. పార్టీ సీనియర్లతో వారిని పిలిపించి వివరణ తీసుకుంటారు. ఇదీ టీడీపీ స్కూలు సిలబస్. అన్న ఎన్టీఆర్ స్థాపించిన స్కూలు మరి! ఆయన రూపొందించిన సిలబస్ అది!!

కానీ ఇప్పుడు మారుతున్న కాలంలో కొత్త సిలబస్ వచ్చింది. ఇతర పార్టీల నుంచి అవసరార్థం వచ్చి చేరిన విద్యార్థులు, అందులో ఎవరికి నచ్చిన పేజీలు వారు చేర్చుకుంటున్నారు. పార్టీకి ఆరోప్రాణమైన క్రమశిక్షణ ఉల్లంఘిస్తున్నారు. బెదిరింపులు.. సెటిల్‌మెంట్లు.. వసూళ్లు.. నియోజకవర్గాల్లో కుటుంబపాలన. చివరాఖరకు పార్టీని కూడా లెక్కచేయనంత ధిక్కారపర్వం. ఫలితంగా క్రమశిక్షణ కట్టుతప్పుతోంది. అంతిమంగా అప్రతిష్ఠ పాలవుతోంది పార్టీనే. దీనికి తెరదించేది ఎప్పుడు?.. వ్యక్తుల కంటే పార్టీ గొప్పదని సంకేతాలు ఇచ్చేదెన్నడు?.. ఇవీ పసుపు సైనికుల ప్రశ్నాస్త్రాలు.

"మీడియా అంటే నాకు లెక్కలేదు. నేను అన్ని చేసి వచ్చినొన్ని.. రాసుకోండి ..ఏం రాసుకుంటారో. తప్పు చేస్తే రాయండి.. ఆధారాలు లేకుండా రాస్తే తాటతీస్తా. తనపై వివాదాలు రాస్తే రైలు పట్టాలపై పడుకోబెట్టి చంపుతా. కొంతమంది నాకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారు. నా కుటుంబ పెత్తనం ఉందని అంటున్నారు. భూ అక్రమాలు చేశాను అని చెబుతున్నారు.. వీటన్నింటినీ నిరూపించాలి లేదంటే.. రైలు పట్టాలపై పడుకోబెడతా " - ఇవీ.. వైసీపీలో కార్మికమంత్రిగా పనిచేసి, ఎన్నికల ముందు టీడీపీలో చేరి గుంతకల్ ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మనూరు జయరామ్ మీడియాకు జారీ చేసిన హెచ్చరికలు!

వైసీపీ నుంచి టీడీపీలో చేరి ఎమ్మెల్యేలు, మంత్రులయిన వారు ఇంకా వైసీపీ బెదిరింపుల సిలబస్ పాటిస్తున్నట్లున్నారు. వైసీపీ జమానాలో కార్మికశాఖలో కొడుకుల పెత్తనానికి తెరలేపి, కర్నూలు జిల్లాలోని తన నియోజకవర్గాన్ని పేకాట క్లబ్బుగా మార్చేశారని.. విపరీతమైన ఆరోపణలు ఎదుర్కొన్న గాలి జనార్దన్‌రెడ్డి మిత్రుడిగా పేరున్న మాజీ మంత్రి, టీడీపీ గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరి జయరాం తన వైసీపీ సహజశైలిని, సిలబస్‌ను ఇంకా మార్చుకోలేదు.

కర్నూలు జిల్లా నుంచి గుంతకల్‌కు మారిన జయరామ్.. గతంలో వైసీపీలో ఉండగా ప్రాతినిధ్యం వహించిన ఆలూరు నియోజకవర్గంలో, గ్రామాల్లో టెంట్లు వేసి మరీ పేకాట ఆడించారంటూ అనేక కథనాలు మీడియాలో వెలువడ్డాయి. బెంగళూరు నుంచి కూడా వచ్చి పేకాట ఆడిస్తున్నారని, దానిని ఆయన కుటుంబసభ్యులే ముందుండి నడిపిస్తున్నారంటూ మీడియా కథనాలు విరుచుకుపడ్డాయి.

అప్పట్లో ఆయన గ్రామంలో పట్టుబడ్డ జూదరులు, పేకాట ముక్కల ఫొటోలు కూడా మీడియాలో వచ్చినవే. అసలు జయరాం కుటుంబసభ్యులే బెంగుళూరు నుంచి లారీల్లో మద్యం తీసుకువచ్చి అమ్ముతున్నారని, ఇసుకను తీసుకువెళ్లిన లారీల్లోనే.. మద్యం తీసుకువస్తున్నారని, నాటి టీడీపీ నేతలు మీడియా సమక్షంలోనే ఆరోపించారు. టీడీపీ నేతలపై జయరామ్ అనుచరులు దాడులు చేయిస్తున్నారంటూ, టీడీపీ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

ఇప్పుడు అదే జయరామ్ టీడీపీలో ఉన్నందున.. టీడీపీ స్కూలు సిలబస్ పాటిస్తున్నారేమోననుకున్నారు. అంటేరాముడు మంచిబాలుడిలా ఉంటారని భావించారు. కానీ ఆయన ఇంకా జగన్ బెదిరింపుల సిలబస్‌నే ఫాలో అవుతున్నారని తాజాగా బయటపడింది. " నాపై రాసిన మీడియాను రైలుపట్టాలపై పడుకోబెడతా. తాట తీస్తాన"ంటూ బెదిరించిన వీడియో ఒకటి, ఇప్పుడు క్రమశిక్షణకు మారుపేరుగా భావించే టీడీపీని సంకట పరిస్థితిలోకి నెట్టింది.

అయితే ఇది విపరీతంగా వైరల్ అయి, పార్టీకి అప్రతిష్ఠగా మారడంతో దిద్దుబాటుకు దిగడం అనివార్యంగా మారింది. ఎమ్మెల్యే జయరామ్ మీడియాను బెదిరించడంపై టీడీపీ నాయకత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి పద్ధతి పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని, మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని టీడీపీ రాష్ట అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్.. ఎమ్మెల్యే జయరామ్‌కు ఫోన్ చేసి హెచ్చరించినట్లు పార్టీ వర్గాలు చెప్పాయి.

నిజానికి మాజీ మంత్రి జయరామ్ నియోజకవర్గంలో కుటుంబసభ్యుల పెత్తనం ఎక్కువయిందని, అది పార్టీకి చెడ్డపేరు తెస్తోందని స్థానిక విలేకరులు, అక్కడ తొలి నుంచీ పనిచేస్తున్న టీడీపీ వారిని హెచ్చరించారట. ఆ విషయాన్ని వారు జయరామ్ చెవిని వే శారట. దానితో నేతల సమక్షంలోనే విలేకరులను పిలిపించి.. పార్టీ నేతలకు చెబుతున్నవి నా ముందు చెప్పమని, లేకపోతే రైలుపట్టాలమీద పడుకోబెడతానని బెదిరించారట. అదీ సంగతి.

అయితే ఇలాంటి కుటుంబపెత్తనాల నియోజకవర్గాలు, రాష్ట్రంలో చాలానే ఉన్నాయన్నది పార్టీ వర్గాల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదు. వైసీపీ నుంచి వచ్చి ఎమ్మెల్యేలు, మంత్రులయిన కొందరు, ఎన్నికల ముందు ఎమ్మెల్యే టికెట్లు తీసుకున్న మరికొందరు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో.. భర్త, తండ్రి, తమ్ముడు, కొడుకు, భార్యల పెత్తనంతో పార్టీ బద్నామ్ అవుతోందన్న ఆందోళన పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. నియోజకవర్గాలను కుటుంబసభ్యుల పెత్తనానికి వదలేసి.. వారంతా హైదరాబాద్, బెంగుళూరు, చెన్నైలో వ్యాపారాలు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఉమ్మడి ప్రకాశంలో కొత్తగా నియమితులైన ఒక మంత్రి నియోజకవర్గ పార్టీ వ్యవహారాన్ని పీఏకు, వ్యాపారాలు-వసూళ్లబాధ్యతను తన ఆంతరంగికుడికి అప్పగించారన్న ఆరోపణలున్నాయి. ప్రధానంగా క్వారీ రాళ్ల రవాణా చేసే లారీలు, ఇసుక, మట్టి, బియ్యం రవాణా వ్యవహారాలన్నీ సదరు ఆంతరంగికుడే చూస్తున్నారన్నది పార్టీ నేతల ఫిర్యాదు. మరో మంత్రి తన సోదరుడికి నియోజకవర్గానికి అప్పగించారన్నది మరో ఆరోపణ.

ఇక రాయలసీమలో.. వైసీపీ నుంచి ఎన్నికల ముందు పార్టీలో చేరి మంత్రి అయిన మరో ప్రముఖుడు, నియోజకవర్గాన్ని తన భార్యకు అప్పగించారన్న ఫిర్యాదులున్నాయి. ఆమెకు మంత్రి

మిగతా.. 2లో



## ఇంటింటి సమగ్ర సర్వే సక్సెస్

- రెండు రోజుల్లో ముసాయిదా నివేదిక
- ఫిబ్రవరి 2న కేబినేట్ సబ్ కమిటీకి తుది నివేదిక
- దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ
- అధికారులు, ఉద్యోగులను అభినందించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్:** రాష్ట్రంలో విజయవంతంగా పూర్తయిన సమగ్ర కుల గణన పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే దేశ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని ముఖ్యమంత్రి అన్నారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేపై ప్రశంసలు అందుతున్నాయని చెప్పారు.

బుధవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్క మార్క, మంత్రులు దామోదర రాజనర్సింహా, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ఉద్యోగులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కుల గణన ప్రక్రియ సామాజిక సాధికారతతో పాటు, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాలందరి అభ్యున్నతికి ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ కుల గణన సర్వేను చేపట్టి తమ చిత్తశుద్ధిని చాటుకుందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు

మిగతా.. 2లో

మహా విషాదం



## కుంభమేళా తొక్కిసలాటలో 30 మంది మృతి

- అందులో 25 మందిని గుర్తించాం
- 90మంది భక్తులకు గాయాలు
- డీఐజీ వైభవ్ కృష్ణ

**ప్రయాగ్ రాజ్:** ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై యూపీ ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసింది. ఈ ఘటనలో 30 మంది భక్తులు చనిపోయారని ఆ రాష్ట్ర డీఐజీ వైభవ్ కృష్ణ ప్రకటించారు. అందులో 25 మంది భక్తులను గుర్తించామని, మరో ఐదుగురిని గుర్తించాల్సి ఉందన్నారు. ఆస్పత్రిలో 90 మంది భక్తులు చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. అర్ధరాత్రి 1-2 గంటల మధ్యలో తొక్కిసలాట జరిగిందని తెలిపారు. వివరాలకు హెల్ప్‌లైన్ నంబర్ 1920ను సంప్రదించాలని సూచించారు.

రోజాపై మళ్లీ ఐరెన్‌లెగ్ ట్రోల్! 6లో



03
'పెద్దిరెడ్డి' సంగతి తేల్చండి!



03
రేవంత్.. మరి ఇప్పుడు 'మేఘా' ఈస్టిండియా కంపెనీ కాదా?



05
ప్రకాష్‌రాజ్ ప్రయాగరాజ్ స్నానం ఉత్తిదేనట!




08
ఏపీ కొత్త డీజీపీ హరీష్ కుమార్ గుప్తా!

## పవన్ సీఎం.. బాబు కూటమి చైర్మన్

- లోకేష్ డిప్యూటీ సీఎం
- తనకు కలవచ్చిందన్న దర్శకుడు తమ్మారెడ్డి

**హైదరాబాద్:** సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉండే సినీ దర్శకుడు, సామాజిక అంశాలపై తరచూ స్పందించే తమ్మారెడ్డి భరద్వాజ తాజాగా ఒక ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు పవన్ సీఎం అయినట్లు కలవచ్చిందంటూ చేసిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది.



పవన్ కళ్యాణ్ సీఎం కావాలని, లోకేశ్ డిప్యూటీ కావాలని ఇటీవల ఆయా పార్టీల నేతలు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై తాజాగా నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి. 'కూటమికి చంద్రబాబు ఛైర్మన్ గా ఉండి.. పవన్ ను సీఎం , లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేసినట్లు రాత్రి కల వచ్చింది. వాళ్లిద్దరూ విజయవంతంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తారని అనిపించింది. ఈలోగా మెలకువ వచ్చింది' అని ఆయన మాట్లాడిన వీడియో వైరలవుతోంది.




## సింహాచలం పంచగ్రామాల సమస్యకు పరిష్కారం

- పంచగ్రామాల్లోని 12,149 ఇళ్లను క్రమబద్ధీకరించాలని నిర్ణయం
- 610 ఎకరాల ప్రభుత్వ భూమిని సింహాచల దేవస్థానానికి ఇచ్చేందుకు సంసిద్ధం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయం
- రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ వెల్లడి

**అమరావతి:** ఎంతో కాలం నుండి అపరిష్కృతంగా ఉన్న సింహాచలం పంచ గ్రామాల సమస్యకు త్వరలో ప్రభుత్వం పరిష్కారం చూపనున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెవిన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో రాష్ట్ర సచివాలయంలో నేడు జరిగిన సమావేశంలో ఈ సమస్యకు సంబందించి పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు.

బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో విశాఖ పట్నానికి చెందిన పలువురు శాసన సభ్యులతో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పంచగ్రామాల్లోని

మిగతా.. 2లో



## జయహో భారత్

- జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ గగనతల ప్రయోగం విజయవంతం
- అంబరాన్నంటిన శాస్త్రవేత్తల సంబరాలు
- సైన్స్ ఫెయిర్ నందు ప్రతిభ చూపిన సూళ్లూరుపేట ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో కలిసి షార్ కేంద్రంలో వందో ప్రయోగమైన జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్

**శ్రీహరి కోట:** ఇస్రో భారత అంతరిక్షంలో మరో మైలురాయిని చేరుకుంది. శ్రీహరికోటలోని షార్ నుంచి తన వందో ప్రయోగమైన జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ను నేటి బుధవారం ఉదయం 6.23 గం.లకు రోదసిలోకి సక్సెస్ ఫుల్‌గా దేశీయంగా రూపొందించిన ఈ

క్రయోజనిక్ రాకెట్ ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపి భారత కీర్తిని మరింత ఇనుమడింప చేసింది. GSLV-F 15 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తల సంబరాలు అంబరాన్నంటాయి.

మిగతా.. 2లో

2

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ॥ గురువారం 30, జనవరి 2025 ॥



## నేటి నుంచే రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రారంభం

మొదటి పేజీ తరువాయి..

దేవాదాయ, ఎనర్జీ, ఏపీఎస్ ఆర్టీసీ, రెవెన్యూ, అన్నక్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ వంటి వివిధ శాఖల్లో సుమారు 161 సేవలను ప్రవేశపెట్టనుంది. దేశంలోనే మొదటి సారి వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశ పెడుతున్నామని, ధృవపత్రాల కోసం పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి ఇక స్వస్తి పలకనున్నామని ముఖ్యమంత్రి అన్నారు. అదేవిధంగా పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని, ఆ దిశగా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయాలని సూచించారు. వాట్సాప్ ద్వారా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్ 22న మెటాతో ఒప్పందం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌ను డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో అగ్రగామిగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న తరుణంలో పాలన, ప్రభుత్వ సేవలను పౌరులకు వేగవంతంగా అందజేయడానికి ఈ విధానం సులభతరం కానుంది. వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ సమీక్షలో సీఎస్ కె.విజయానంద్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# టీడీపీలో కట్టుదాటుతున్న క్రమశిక్షణ?

మొదటి పేజీ తరువాయి..

మాదిరిగానే ప్రొటోకాల్ గౌరవం ఇవ్వాలన్న వీడియో ఒకటి వైరల్ అయిన విషయం తెలిసిందే. దానిపై స్వయంగా సీఎం సైతం రంగంలోకి దిగి, మందలించాల్సిన పరిస్థితి వచ్చింది.

ఎన్నికలకు నెలరోజుల ముందు, టీడీపీలో చేరి మంత్రి అయిన ఓ గోదావరి జిల్లా ప్రముఖుడు.. తనశాఖను బావకు, నియోజకవర్గాన్ని తండ్రికి అప్పగించారన్నది వస్తున్న ఆరోపణ. బావ తరచూ సచివాలయంలోని చాంబరుకు వచ్చి, వ్యవహారాలు చక్కదిద్దుతున్నారని సచివాలయ వర్గాల్లో సైతం చర్చ జరుగుతోంది. శాఖాపరమైబదిలీల వ్యవహారాల్లో, ఆయనే చక్రం తిప్పుతున్నారన్న ఫిర్యాదులు లేకపోలేదు.

ఎన్నికల ముందు పార్టీలో చేరి, మంత్రి అయిన ఓ ఉత్తరాంధ్ర ప్రముఖుడు.. నియోజకవర్గాన్ని తన తండ్రి, కుటుంబసభ్యులకు అప్పగించారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు మంత్రులకు ర్యాంకులు ఇస్తున్న సందర్భంలో, ఆ మంత్రి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

ఇక ఎన్నికల ముందు పార్టీలో చేరిన ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన మంత్రి.. తనతోపాటు పార్టీలో చేరిన వారికి, వైసీపీ వారికి ఇసుక, మట్టి పనులు ఇప్పిస్తున్నారని. ఐఐటి పనుల కాంట్రాక్టులు కూడా, తనతో వచ్చిన వైసీపీ వారికే కట్టబెడుతున్నారన్నది టీడీపీ నేతల బహిరంగ ఫిర్యాదు. బుజ్జి అనే తన ప్రధాన అనుచరుడి ని, ఆయన విపరీతంగా ప్రోత్సహిస్తున్నారని చెబుతున్నారు.

ఉత్తరాంధ్రలో ఓ సీనియర్ మంత్రికి చెందిన పేషీలో వసూళ్ల పర్వం, బహిరంగంగానే నడుస్తోందని సచివాలయ వర్గాలు బహిరంగంగానే చర్చించుకుంటున్నాయి. ఆ విషయంలో సదరు మంత్రి ఎవరికీ భయ పడటం లేదని, ఆయన వద్ద పనిచేసే ఓ అధికారి వసూళ్ల విషయంలో నిర్భయంగా వ్యవహరిస్తుండటంపై, పార్టీ నేతలే విస్తుపోతున్నారట.

## సింహాచలం పంచగ్రామాల సమస్యకు పరిష్కారం

మొదటి పేజీ తరువాయి..

12,149 ఇళ్లను క్రమ బద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసు కోవడం జరిగిందన్నారు. ఇందుకై ప్రత్యామ్నయంగా దాదాపు రూ.5,300 కోట్ల విలువ చేసే 610 ఎకరాల ప్రభుత్వ భూమిని సింహాచల దేవస్థానానికి ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి సింహచల దేవ స్థానం అనువంశిక ధర్మకర్త అయిన శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు కూడా ఆమోదాన్ని వ్యక్తం చేయడం జరిగిందన్నారు. ఈ సమస్యకు సంబందించి గతంలో ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.పై పలువురు కోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. ప్రస్తుతం కోర్టులో ఉన్న ఆ కేసులను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడురాష్ట్ర వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు జి.ఓ.నెం. 338, 296 లను ను జారీ చేశామన్నారు. ఈ జీవోల కింద విశాఖలో 70 వేల మంది క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ జి.ఓల ప్రకారం రెండేళ్ల కాల వ్యవధిలో ఆ భూములపై లబ్దిదారులకు అన్ని హక్కులు సంప్రాప్తం అయ్యే విధంగా కన్వేయన్సు డీడ్ కూడా ఇవ్వాలని స్పష్టం చేయడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వం ఆ జి.ఓలను పట్టించుకోకుండా లబ్దిదారులకు న్యాయం చేసే విధంగా స్పందించ లేదన్నారు. తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక శాసన సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి చేసిన విజ్ఞప్తి మేరకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

అందుకు తగ్గట్టుగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అయితే జి.ఓ.ను 2017 జారీ చేసిన నేపథ్యంలో అప్పటి నుండే ఈ భూములను క్రమబద్ధీకరించాలని, అప్పటి నుండి రెండేళ్ల కాలవ్యవధి పూర్తి అయిన వాటికి కన్వేయన్సు డీడ్లను కూడా జారీచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అదే విధంగా రైతులు సాగు చేసుకునే భూములు, కొన్ని ఖాళీ స్థలాలకు సంబందించి కోర్టులో పలు కేసులు ఉన్నందున, వాటిని కూడా పరిష్కరించరించేందుకు దశల వారీగా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

యు.ఎల్.సి.లోని అదనపు భూములు ఏవైనా ఆక్రమణకు గురైనా, వాటిని పి.ఓ.టి. చట్టం ప్రకారం పదేళ్ల కాల వ్యవధిలో అలియనేట్ చేయాల్సి ఉందని, అయితే అటు వంటి భూములకు కూడా రెండేళ్ల కాలవ్యవధిలోనే కన్వేయన్సు డీడ్లును ఇచ్చేందుకు ఈ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గాజువాక ఇనాం భూముల క్రమబద్ధీకరణకు సంబందించి తమ ప్రభుత్వం 2018లో జి.ఓ.నెం.301 ను జారీచేయగా ఆ జి.ఓ. ప్రకారం దాదాపు 7 వేల మంది ధరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. అయితే ఈ ప్రక్రియ కూడా పూర్తి కాకుండా అపరిష్కృతంగా ఉన్నందున, తిరిగి ఆ జి.ఓ.ను కూడా సవరించి నూతన మార్గదర్శకాలతో నూతన జి.ఓ.ను జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

గాజువాక శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సింహాచలం దేవస్థానం భూమి సుమారు 420 ఎకరాలు ఆక్రమణకు గురై వాటిలో దాదాపు 12,149 ఇళ్లను నిర్మించుకోవడం జరిగిందన్నారు. అయితే ఆ ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు గతంలో తమ ప్రభుత్వం జి.ఓ.నెం.229 నూ జారీ చేస్తూ 420 ఎకరాల ప్రభుత్వ భూమిని మరో చోట ఇచ్చేందుకు, క్రమబద్ధీకరణ క్రింద వచ్చే ఫీజను కూడా దేవస్థానానికి ఇచ్చేందుకు నిర్ణయించండమైందన్నారు.

అయితే ఆక్రమణకు గురైన దేవస్థానం భూమి విలువకు తగిన భూమిని ఇవ్వాలని కోరుతూ కొంత మంది కోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం మేరకు 420 ఎకరాలకు బదులుగా 610 ఎకరాలు (సమాన రిజిస్ట్రేషన్ విలువతో) సింహాచలం దేవస్థానానికి బదలాయించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. దీని రిజిస్ట్రేషన్ విలువ దాదాపు రూ.5,300 కోట్ల వరకూ ఉందన్నారు. పెదగంట్యాడ, గాజువాక, గొల్లల పాలెం తదితర ప్రాంతాల్లో సింహాచలం దేవస్థానానికి 610 ఎకరాల భూమి ఇస్తున్నామన్నారు.

దేవస్థానానికి అవసరమైన చందనం చెట్లను పెంచుకునేందుకు అవకాశం ఉన్న చోట భూమి ఇస్తున్నామన్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కోర్టులో కౌంటరు ఫైల్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. రెండు మూడు మాసాల్లో ఈ సమస్యకు ఒక పరిష్కార మార్గం దొరుకుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. గాజువాకలో ఇనాం భూమిని క్రమబద్ధీకరించేందుకు కూడా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ భూముల క్రమ బద్ధీకరణకు సంబందించి 2015-16 సంవత్సరంలో జి.ఓ. నెం. 301 ను జారీ చేయడం జరిగిందని, దాని కట్ ఆఫ్ తేదీ 2017 తో ముగిసిందన్నారు. అయితే ఆ కట్ ఆఫ్ తేదీని 31.12.2023 వరకూ పొడిగస్తూ నూతన జి.ఓ. ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఇందు వల్ల మరో ఆరు వేల మందికి లబ్ది చేకూరే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

విశాఖపట్నం పశ్చిమ నియోజక వర్గం శాసన సభ్యులు పి.జి.వి.ఆర్.నాయుడు (గణబాబు) మాట్లాడుతూ సింహాచలం భూముల క్రమబద్ధీకరణ విషయంలో 1998 లో తమ ప్రభుత్వ హయాంలోనే జి.ఓ.నెం.578 ను జారీ చేయడం జరిగిందని, దానికి అనుగుణంగా చాలా మంది క్రమబద్ధీకరణ చేసుకోవడం జరిగిందన్నారు. తదుపరి ఏ ప్రభుత్వాలు ఈ విషయాన్ని పట్టించుకోలేదన్నారు.

తిరిగి 2014-19 కాలంలోనే తమ ప్రభుత్వమే జి.హోఓ. నెం.229 ను జారీ చేసి సింహాచల భూముల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల కోర్టులోని కేసు కూడా పరిష్కారం అవుతుందని, దాదాపు 70 శాతం మందికి న్యాయం చేకూరుతుందని ఆయన తెలిపారు.

అదే విధంగా భూముల క్రమబద్ధీకరణకు గతంలో తమ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం.296 మరియు 388 లను విశాఖపట్నం వాసులే ఎక్కువగా వినియోగించుకోవడం జరిగిందన్నారు.

విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్సు అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీ కృష్ణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.




## వికసిత్ అనంతపురం దిశగా లక్ష్య సాధనకు కృషి చేయాలి

### - 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్

**అనంతపురం:** అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం అనంతపురం జిల్లాలో " కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపైన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ మరియు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ లతో కలిసి సంబంధిత జిల్లా అధికారులతో 20 సూత్రాల కార్యక్రమం చైర్ పర్సన్ లంకా దినకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమీక్ష సమావేశంలో చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యం వికాసిత భారత్ 2047 అని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష స్వర్ణాంధ్ర 2047 అని, ఈ లక్ష్యంతో చేసే కార్యాచరణ ద్వారానే అనంతపురం పార్లమెంట్ పరిధిలోని ప్రస్తుత సవాళ్లను అధిగమించి విజయవంతంగా " వికసిత అనంతపురం "గా దిశగా లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు.

ఈ సమీక్షలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం మరియు 2019- 24 మధ్య జరిగిన అవకతవకలు మరియు ప్రస్తుత అమలు తీరు పైన, ప్రతి గ్రామ పరిధిలోని ప్రతి గృహానికి సురక్షిత త్రాగునీరు ఇచ్చే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జల్ జీవన్ మిషన్ అమలు తీరు, అనంతపురం పట్టణంలో అమృత్ పథకం నిధుల వినియోగంతో సాధించిన ఫలితాలు, అమృత్ 2.0 లక్ష్యాలపైన, గ్రామీణసడక్ యోజన, లక్ పతి దీదీ, కళ్యాణ్ అన్నయోజన, పీఎం సూర్య ఘర్ మరియు కుసుమ్, పీఎం ఆవాస యోజన, పీఎం విశ్వకర్మ, మరియు పట్టణ అభివృద్ధి నిధుల వినియోగ ప్రణాళిక, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతో పాటు, జిల్లాను ఎలెక్ట్రానిక్ వస్తు తయారీ కేంద్రంగా మలచడానికి ప్రణాళికలు మరియు పారిశ్రామికీకరణ అభివృద్ధి తదితర అంశాలపైన సమీక్ష చేయడం జరిగింది.

ఈ సంవత్సరం ఉపాధి హామీలో మెటీరియల్ కాంపోనెంట్ 201.63 కోట్లలో ఇప్పటివరకు 115.76 కోట్లు మాత్రమే వ్యయం అయునందున దాదాపు 85 కోట్లు నిధులు మురిగిపోయే ప్రమాదం ఉన్నందున, ప్రణాళికబద్ధంగా ఖర్చు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అలాగే గత 5 సంవత్సరాలు ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ ఖర్చు చేసిన వివరాలను మరియు నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేసిన వివరాలు ఇవ్వమని అధికారులను ఆదేశించారు.

గత 5 సంవత్సరాలలో మెటీరియల్ కాంపోనెంట్ వ్యయం ద్వారా కల్పించిన ఆస్తుల నాణ్యత మరియు నిబంధనలకు విరుద్ధంగా చేసిన వ్యయం పైనా విచారణ చేయమని జిల్లా జాయింట్ కలెక్టర్ కు చెప్పడం జరిగింది. ఒక రోజుకు ఉపాధిహామీ వేతనం రూ. 300 అయితే జిల్లాలో సగటున రూ.263.20 మాత్రమే, మిగతా జిల్లాలకన్నా సగటు వేతనం బాగానే చెల్లిస్తున్నప్పటికీ ఇంకా పెంచేందుకు కృషి చేయాలన్నారు. గత 5 సంవత్సరాలు జల్ జీవన్ మిషన్ దీర్ఘకాలిక నీటి వనరుల లభ్యత లేకుండా 2019-24 మధ్య పనులు చేయడం వల్ల ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన లక్ష్యాలు జిల్లా చేరుకోలేక పోయిందని మరియు నిధులు దుర్వినియోగం జరిగిందని, సమీక్షకు అధికారులు సరైన సమాచారంతో రావాలని ఆదేశించడం జరిగింది. పీఎం సూర్య ఘర్ పథకం అమలులో వేగం పెంచాలి, ఈ పథకం క్రింద కనిష్ఠంగా 30 వేలు, గరిష్టంగా 78 వేలు సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. స్వయం సేవ గ్రూపులతో అనుసంధానం అయ్యి నిర్దేశించిన లక్ష్యాలు అందుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ పథకం క్రింద 5,268 రిజిస్ట్రేషన్లు పూర్తి అయినా, ఇన్స్టాలేషన్ చాలా మందగమనంగా కేవలం 785 మాత్రమే అయ్యాయి, ఎస్సి, ఎస్టీల సర్వీసులు 71,170 ఈ కేటగిరీ వర్గాల పైన ప్రత్యేక దృష్టి అవసరమని చెప్పడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ఏపీఎస్పీడిసిల్ ఎస్ఈ సంపత్ కుమార్, సిపిఓ అశోక్ కుమార్, డిఆర్డిఏ పిడి ఈశ్వరయ్య, డ్వామా పిడి సలీం భాష, స్కిల్ డెవలప్మెంట్ అధికారులు ప్రతాప్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి సమగ్ర సర్వే సక్సెస్

మొదటి పేజీ తరువాయి..

ఈ గణాంకాలు ఉపయోగపడుతాయని అన్నారు. సర్వే డేటా ఎంట్రీ పూర్తయిందని, ఒకటి రెండు రోజుల్లో ముసాయిదా నివేదికను సమర్పిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఫిబ్రవరి 2వ తేదీ లోగా కేబినెట్ సబ్ కమిటీకి తుది నివేదికను అందజేయాలని ముఖ్య మంత్రి ఆదేశించారు. నవంబర్ 6వ తేదీన రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కులసర్వే 2024) మొదలైంది. అన్ని జిల్లాల్లో డిసెంబర్ మొదటి వారంలో సర్వే పూర్తయింది. ప్రణాళిక విభాగం అధ్వర్యంలో చేపట్టిన ఈ ఇంటింటి సర్వే మహా యజ్ఞంలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు దాదాపు లక్ష మందికిపైగా ఉద్యోగులు పాలుపంచుకున్నారు.

రాష్ట్రంలోని దాదాపు 1.16 కోట్ల కుటుంబాలను సర్వేకు గుర్తించింది. ఎన్యుమరేటర్లను ఇంటింటికీ పంపించి వివరాలను సేకరించింది. దాదాపు 96 శాతానికి పైగా కుటుంబాల వివరాలను సర్వే బృందాలు విజయ వంతంగా సేకరించాయి. వీటికి సంబంధించిన డేటా ఎంట్రీని పూర్తి చేశాయి. కొన్నిచోట్ల కుటుంబాలు సర్వేకు నిరాకరించటం, కొన్ని ఇండ్లకు తాళాలు ఉండటం, కొన్ని కుటుంబాలు అందుబాటులో లేకపోవటం తదితర కారణాలతో కొన్ని కుటుంబాలు సర్వేలో పాలుపంచుకోలేదదని అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

### రికార్డు వేగంతో కుల గణన

- అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఫిబ్రవరి 4వ తేదీన సీఎం నేతృత్వంలో భేటీ అయిన రాష్ట్ర మంత్రివర్గం ఇంటింటి సర్వే ద్వారా కుల గణన చేసేందుకు నిర్ణయం తీసుకుంది.
- ఫిబ్రవరి 16వ తేదీన ఈ సర్వే చేపట్టేందుకు అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసింది.
- సెప్టెంబర్ 12వ తేదీన ఇంటింటి సర్వే కుల గణన చేపట్టేందుకు అవసరమైన విధి విధానాలను ఖరారు చేసేందుకు ప్రభుత్వం కేబినేట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారధ్యంలో ఆరుగురు మంత్రులతో ఏర్పాటయిన సబ్ కమిటీ వివిధ దఫాలుగా సమావేశమైంది.
- అక్టోబర్ 9వ తేదీన మంత్రి వర్గ ఉపసంఘం ఇచ్చిన సిఫారసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల గణన పేరిట సర్వే చేపట్టాలని, ప్రణాళిక విభాగాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించారు.
- అక్టోబర్ 10వ తేదీన ప్రణాళిక విభాగం సర్వేకు సంబంధించిన పూర్తి విధి విధానాలతో జీవో నెం.18 జారీ చేసింది.

# దుర్గగుడి అభివృద్ధికి సరికొత్త మాస్టర్ ప్లాన్

### - మాస్టర్ ప్లాన్‌లో పొందు పర్చాల్సిన అంశాలపై ఎమ్మెల్యే సుజనా చౌదరి సమీక్ష

**విజయవాడ:** ఇంద్రకీలాద్రి అభివృద్ధికి సరికొత్త మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై ఎమ్మెల్యే సుజనాచౌదరి సమీక్షించారు. తాడిగడప లోనిఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్ట్‌లు, మరియు టెక్నికల్ టీంతో ఎమ్మెల్యే బుధవారం సమీక్ష నిర్వహించారు. భక్తులకు మరింత మెరుగైన సేవలను అందించడానికి, భవిష్యత్తులో ఎంతమంది భక్తులు వచ్చినా అసౌకర్యం సుజనా చౌదరి వివరించారు.. భక్తులకు మెరుగైన వసతులను, సౌకర్యాలను కల్పించేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.. అందుకు సంబంధించిన కొన్ని సూచనలను ఎమ్మెల్యే సూచించారు..

గతంలో పెట్టిన అంశాలతో పాటు మరికొన్ని అంశాలను పొందు పర్చాలని ఎమ్మెల్యే ఆదేశించారు.




కలగకుండా, ఇబ్బందులు రాకుండా ఉండటానికి సరికొత్త మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై అధికారుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించేలా మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో పొందుపరచవలసిన అంశాలను అధికారులు ఎమ్మెల్యే

కార్యక్రమంలో దుర్గగుడి ఈ ఈ లు టి వైకుంఠరావు, కె వి ఎస్ ఆర్ కోటేశ్వరరావు, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ బి పాండురంగారావు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ రమేష్, శ్రీనివాస్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## 'విజన్'కు - విధ్వంసానికి తేడా ప్రజలు తెలుసుకోవాలి

### రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి, మహానాడు:** గత 5 ఏళ్ళుగా టిడ్కో ఇళ్ళను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందనే అభిప్రాయం మాత్రమే ప్రజల్లో ఉంది.. కాని టిడ్కో ఇళ్ళ వెనుక సొంత కాళ్ళపై నిలబడే ఒక బలమైన వ్యవస్థను కూడా గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందనే వాస్తవాలను ప్రజలు తెలుసుకోవాలని సూక్ష్మ, చిన్న,మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం విజయవాడ రూరల్ జక్కంపూడిలో 2018లోనిర్మాణం చేపట్టిన "ఫ్లాటేడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్"ను మంత్రి పరిశీలించి, నిర్మాణ పనులను చేపట్టిన సంస్థ ప్రతినిధులు, అధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు, దిగువ మధ్య తరగతి వారి భవిష్యత్తుకు బలమైన పునాదులను వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా కూల్చారన్నది ప్రజలకు స్వయంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కాంప్లెక్స్ ద్వారా టిడ్కో ఇళ్ళలో నివాసం ఉండే ప్రజలకు స్వయం ఉపాధి కల్పించడం ప్రధాన ఉద్దేశంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. గత 5 ఏళుళ్ళగా జరిగిన విధ్వంసంలో ప్రజలు కోల్పోయిన భవిష్యత్తుకు ప్రత్యక్ష సాక్షి మారిన జక్కంపూడి ఫ్లాటేడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ను ఉత్పత్తి, ఉపాధి కేంద్రంగా మారుస్తామని మంత్రి శ్రీనివాస్ తెలిపారు.




**సికింద్రాబాద్:** వారాసిగూడ చౌరస్తాలో స్వాతంత్ర సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్, నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో వీరి విగ్రహాల ముందు పలు పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం మూలంగా ఈ యొక్క విగ్రహాలు కనిపించక వారికి అవమానం కలిగేలా ఉన్నాయని బౌద్ధ నగర్ బిజెపి అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్ తెలిపారు.

వ్యక్తిగత ఫోటోలతో ఏర్పాటు చేసే అన్ని పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు విగ్రహాల ముందు ఏర్పాటుచేసిన వెంటనే తొలగించవలసిందిగా సాయి ప్రసాద్ గౌడ్. సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ సుభాష్ రావు రికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.

డిజిటల్ న్యూస్ పేపర్
గురువారం 30, జనవరి 2025
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

## డిజిటల్ మీడియాలో ..
# జయహో "మహానాడు"
# 3,21,041
## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1న ప్రారంభమైన మన
మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న
మా అభిమాన పాఠకుల
అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారథ్యంలో





బొడెపూడి సుబ్బారావు (BSR)
సారథ్యంలో



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 30, జనవరి 2025

# జగన్ రెడ్డి విధ్వంసానికి అసర్ నివేదికే నిదర్శనం

- వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యాప్రమాణాలు దారుణంగా పడిపోయాయి
- విద్యా ప్రమాణాలు గాడిన పెట్టేందుకు ప్రాథమిక సమస్యలపై దృష్టి
- మధ్యాహ్న భోజన పథకం అమలుతీరుపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అభిప్రాయసేకరణ
- పాఠశాల విద్యపై సమీక్షలో మంత్రి నారా లోకేష్



**ఉండవల్లి:** జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో విద్యాప్రమాణాలు దారుణంగా పడిపోయాయి అనేందుకు జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికే నిదర్శమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పాఠశాల విద్యపై ఉండవల్లిలోని నివాసంలో సమీక్ష నిర్వహించిన మంత్రి.. అసర్ నివేదికపై ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యాప్రమాణాలు గాడిన పెట్టేందుకు ఫ్యాన్సీ కార్యక్రమాలు కాకుండా ప్రాథమిక సమస్యలైన ఫౌండేషన్, లిటరసీ, న్యూమరసీ (FLN) కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించాలి. అదేవిధంగా ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాల మదింపునకు తరగతి ఉపాధ్యాయులతో చర్చించాలి. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించే అంశాన్ని పరిశీలించాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపైనా సమావేశంలో చర్చించారు. ఐవీఆర్ఎస్ ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించాలని ఆదేశించారు. బాలికల స్వీయరక్షణ తర్ఫీదు కోసం శిక్షకులను నియమించాలని ఆదేశించారు. విద్యారంగంలో కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల వినియోగంపైనా సమావేశంలో చర్చించారు. ప్రతి పాఠశాలలోని లైబ్రరీని విద్యార్థులు సద్వినియోగపర్చుకునే విధంగా ఉండవలసిన పుస్తకాలను ఆయా రంగాల నిపుణులతో చర్చించి పాఠశాల లైబ్రరీలను ఏర్పాటుచేయాలని, విద్యార్థులు వినియోగించుకునే తీరును పర్యవేక్షించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థులు, పీఈటీల అభీష్టం మేరకు పాఠశాలల్లో క్రీడా సామాగ్రిని సమకూర్చాలి. పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటుచేయడంతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ప్రభావాన్ని విశ్లేషించాలని ఆదేశించారు.

పది, ఇంటర్ లేదా తత్సమాన కోర్సుల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్స్ పైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఏపీ శకటానికి కేంద్ర ప్రభుత్వ పురస్కారం

- 30 సంవత్సరాల తర్వాత రాష్ట్రానికి బహుమతి
- రిపబ్లిక్‌డే పెరేడ్‌లో యావత్ దేశాన్ని ఆకట్టుకున్న శకటం
- ఏటికొప్పాక బొమ్మల రాజసానికి నెటిజన్ల ఫిదా
- జ్యూరీ అవార్డు ప్రకటించిన కేంద్రం
- అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**అమరావతి:** దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపత్ లో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవం పెరేడ్‌లో భాగంగా ప్రదర్శించిన శకటాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ అవార్డు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని చేతి వృత్తుల కళా ప్రాముఖ్యత చాటుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వారసత్వ సంప్రదాయానికి ప్రతీకగా ఉన్న ఏటి కొప్పాక బొమ్మలతో రూపొందించి, ప్రదర్శించిన శకటం రిపబ్లిక్ డే పెరేడ్ ఉత్సవానికే హైలెట్‌గా నిలిచి యావత్ దేశ ప్రజలందరి దృష్టిని ఆకర్షించింది.

సామాజిక మాధ్యమలలో సైతం లక్షలాది మంది ఈ శకటానికి మంత్రముగ్దులై, ప్రశంసలతో ముంచెత్తారు. రాష్ట్రంలో చేతివృత్తులు, హస్తకళలకు జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం తీసుకురావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఈ శకటాన్ని రూపొందించింది.

శకటం ముందు వినాయకుడు, చివర కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఎత్తైన రూపాలతో, ఇరువైపులా బొబ్బిలి వీణలు, తెలుగువారి కట్టుబొట్టు ప్రతిభింభించేలా అమర్చిన ఏటి కొప్పాక బొమ్మల కొలువుతో శకటం ఆద్యంతం ఆకట్టుకుంది. శకటం నడుస్తున్నంత సేపు ఏటి కొప్పాక బొమ్మల ప్రాశస్త్యాన్ని చాటుతూ "బొమ్మలు బొమ్మలు ఏటికొప్పాక బొమ్మలు, ఆంధ్ర ప్రదేశ్ బొమ్మలు, ఇవి విధ్యను నేర్పే బొమ్మలు, వినోదాల బొమ్మలు, భక్తి చాటేబొమ్మలు, హస్తకళల హంగులు, సహజ ప్రకృతి రంగులు" అంటూ సాగే గీతంతో ప్రజలందరి హృదయాలను దోచుకుంది.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు సైతం ఈ శకటం మనోహరమైన రూపాన్ని చూసి పులకించిపోయారు. అలాగే నెటిజన్లు సైతం ఏపీ ప్రదర్శించిన ఏటి కొప్పాక బొమ్మల శకటాన్ని పెద్ద ఎత్తున సామాజిక మధ్యమాల్లో షేర్ చేసుకున్నారు. చాలా మంది నెటిజన్లు తమ సామాజిక మధ్యమ సాధనల్లో తమ డీపీలుగా కూడా ఈ శకటాన్ని ప్రదర్శించారు. ఓటింగ్‌లో కూడా పెద్ద ఎత్తున ఏటికొప్పాక శకటానికి మదత్తు పలికారు.



## 30 సంవత్సరాల తర్వాత తొలిసారి జూరీ అవార్డు

దేశ రాజధానిలో జరిగే గణతంత్ర దినోత్సవాలలో ప్రదర్శించే శకటాలకు సంబంధించి 30 సంవత్సరాల సంవత్సరాల తర్వాత తొలిసారిగా ఆంధ్ర ప్రదేశ్ శకటానికి కేంద్ర ప్రభుత్వ జూరీ పురస్కారం లభించింది. ఏటికొప్పాక బొమ్మల శకటానికి కేంద్ర ప్రభుత్వం జ్యూరీ తృతీయ బహుమతి ప్రకటించింది.

## సీఎం, డిప్యూటీ సీఎం ప్రశంసలు

ఏటికొప్పా శకటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్‌లు సైతం ప్రశంసించారు. రిపబ్లిక్ డే సందర్భంగా ముఖ్య మంత్రి డిప్యూటీ సీఎంలు ఇద్దరూ తమ సామాజిక మధ్యమల వేదికగా ఈ శకటాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. దశాబ్దాల తర్వాత రాష్ట్ర శకటానికి కేంద్ర ప్రభుత్వ పురస్కారం లభించడం పట్ల సర్వత్ర హర్షాతిరేకాలు వ్యాకషఅమౌతున్నాయి. ఏటి కొప్పాక బొమ్మలకు జియో ట్యాగింగ్ చేసి, ఈ బొమ్మలను అంతర్జాతీయంగా కూడా ప్రసిద్దిని పొందేలా రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

# మంగళగిరిలో మెగా హ్యాండ్లూమ్ పార్క్

- స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత
- 10.80 ఎకరాల్లో పార్కు ఏర్పాటు
- 365 రోజులూ నేతన్నలకు పని కల్పించడమే లక్ష్యం : మంత్రి సవిత



**అమరావతి:** మంగళగిరిలోని ఆటో నగర్ ను ఆనుకుని మెగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేత కార్మికులకు 365 రోజులు భృతి కల్పించే లక్ష్యంలో భాగంగా ఆ పార్కు ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

బుధవారం మంగళగిరిలోని ఆటోనగర్ కు ఆనుకుని ఉన్న 10.80 ఎకరాలను చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గడిచిన అయిదేళ్లు చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందకపోవడంతో పాటు ఉత్పత్తి అయిన వస్త్రాలు విక్రయించే మార్కెట్ సదుపాయం లభించకపోవడంతో, ఎందరో నేతన్నలు అప్పుల పాలయ్యారన్నారు.

కొందరు చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారని విచారం వ్యక్తంచేశారు. టీడీపీ పాలనలో చేనేతలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న సమయం చేనేతకు స్వర్ణయుగమన్నారు. 2014-19లో చేనేతల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నూలు కొనుగోలుకు రాయితీ అందజేశారని, ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించారని మంత్రి గుర్తు చేశారు. వాటితో పాటు ముద్ర రుణాలతో పాటు త్రిఫ్ట్ పథకం అమలు చేశారన్నారు. ఆనాటి ప్రయోజనాలతో పాటు మరికొన్ని కొత్త పథకాలను నేతన్నలకు అందివ్వాలని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ నిర్ణయించారని మంత్రి తెలిపారు.

## చేనేతలకు 365 రోజుల పనే లక్ష్యం

నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు,మంత్రి లోకేశ్ కృతనిశ్చయంతో ఉన్నారని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వపరంగా ఆర్థిక దన్ను అందించడంతో పాటు 365 రోజుల పాటు పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గడిచిన ఏడు నెలల కాలంలో రాష్ట్రంతో పాటు దేశంలోని పలు నగరాల్లో చేనేత బజార్లు ఏర్పాటు చేసి, చేనేత వస్త్రాల విక్రయాలు పెరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు.

అదే సమయంలో రాష్ట్రంలో నూతన టెక్స్ టైల్స్ పాలసీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీవర్ శాలలతో పది నూతన క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. హ్యాండ్లూమ్, టెక్స్ టైల్స్ పార్కుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖలో 5 ఎకరాల్లో యూనిటీ మాల్‌ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

## మంగళగిరిలో మెగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు

మంగళగిరిలోని ఆటోనగర్‌లో మెగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ చర్యలు చేపట్టారని మంత్రి సవిత తెలిపారు. 10.80 ఎకరాల్లో ఈ పార్కును ఏర్పాటు చేయబోతున్నామన్నారు. తమిళనాడులోని కంచి తరహాలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 365 రోజుల పాటు చేనేత కార్మికులకు పని కల్పించాలన్న లక్ష్య సాధనలో భాగంగానే ఈ హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చేనేత జౌళి శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్, హరీశ్ రావు నా కాలిగోటికి కూడా సరిపోరు

- కేటీఆర్ ఒక పనికిమాలిన వ్యక్తి
- ప్రతిపక్ష నేత పదవి కోసం కేటీఆర్, హరీశ్ రావు కొట్టుకుంటున్నారు
- కేసీఆర్ మాదిరి తాను ఎలెక్షన్, కలెక్షన్ చేయలేదు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్ రావులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, హరీశ్ రావు తన కాలిగోటికి కూడా సరిపోరని అన్నారు. కేటీఆర్ ఒక పనికిమాలిన వ్యక్తి అని... పనికిరాని మాటలు మాట్లాడు తున్నారని చెప్పారు. కేటీఆర్‌పై ఉన్న అవినీతి ఆరోపణలు తనపై లేవని అన్నారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, తనపై ఒక్క అవినీతి మరక కూడా లేదని చెప్పారు. కాంగ్రెస్ సభల్లో పల్లీలు, ఐస్ క్రీమ్ లు అమ్ముకునేంత మంది కూడా కేటీఆర్ సభకు రారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేత పదవి కోసం కేటీఆర్, హరీశ్ రావు కొట్టుకుంటున్నారని కోమటి రెడ్డి విమర్శించారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర చేసి, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. కేసీఆర్ మాదిరి తాను ఎలెక్షన్, కలెక్షన్ చేయలేదని కోమటిరెడ్డి అన్నారు.

# రేవంత్.. మరి ఇప్పుడు 'మేఘా' ఈస్టిండియా కంపెనీ కాదా?

- అప్పుడు వద్దన్న మేఘా ఇప్పుడెలా ముద్దయింది?
- వెయ్యి కోట్లకు అనంతగిరి అడవులను మేఘాకు కట్టబెడుతున్నారు
- అనంతగిరి అడవులను అప్పగించకుండా అడ్డుకుంటాం
- రేవంత్ ప్రజలకు ఇచ్చేది తక్కువ ఎగ్గొట్టేది ఎక్కువ
- పోలీస్ పాలన ,మాఫియా పాలన తెచ్చేందుకే రేవంత్ తరచూ కమాండ్ కంట్రోల్ కి వెళ్తున్నారు
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్ ,చిరుమర్థి లింగయ్య, డాక్టర్ మెతుకు ఆనంద్




**హైదరాబాద్:** మేఘా కంపెనీని ఈస్ట్ ఇండియా కంపెనీ తో పోల్చిన రేవంత్ రెడ్డి అదే సంస్థతో ఎందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అనంతగిరి అడవులను మేఘా సంస్థకు రేవంత్ వెయ్యికోట్లకు దారాదత్తం చేశారు. మెఘా అనేది ఇంజినీరింగ్ సంస్థ .వెల్ నెస్ సెంటర్ ఏర్పాటు కు మేఘాతో ఎలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు? అనంతగిరి అడవులను అప్పగించే ప్రయత్నంపై త్వరలోనే ప్రజా మద్దతుతో ఉద్యమం ప్రారంభిస్తాం.

అసహనం వల్లే సీఎం కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి అట్టెన్షన్ డెఫిషియన్సీ సిన్డ్రోమ్ తో భాదపడుతున్నారు. సింగపూర్‌ను రాష్ట్రం అంటున్నాడు. అమెజాన్ వెబ్ సీరీస్ అంటున్నాడు. టీబీ వ్యాధిని లెప్రసిగా చెబుతున్నాడు. ఇలాంటి అవగాహన లేని సీఎం దేశం లో మరొకరు లేరు. అనుభవరాహిత్యం లో రేవంత్ కు రేవంతే సాటి.సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పెట్టుబడులపై గొప్పలు చెప్పుకుంటున్నారు. దావోస్ టూర్ నెట్ వర్కింగ్‌కు మాత్రమే ఉపయోగ పడుతుందని చంద్రబాబు సరిగ్గా చెప్పారు. దేశం లో తన పాటి సీఎం మరొక్క లేనట్టుగా రేవంత్ మాట్లాడటం హాస్యాస్పదం. గతం లో కుదిరిన 40 వేల కోట్ల రూపాయల పెట్టుబడుల్లో 10 వేల కోట్ల రూపాయలు కూడా రాష్ట్రానికి రాలేదు. దావోస్ లో కుదిరే పెట్టుబడుల్లో చాలా వరకు రావని గత అనుభవాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. పథకాలపై ప్రజలు నిలదీస్తుంటే సమాధానం చెప్పుకోలేక రేవంత్ పెట్టుబడుల పై మాట్లాడుతున్నారు. సుస్థిర పాలన కేసీఆర్ ఆనాడు అందించారు కనుకే, రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చి వాస్తవరూపం దాల్చాయి. కేటీఆర్ పనితనం వల్లే ఐటీ రంగం రాష్ట్రం లో పురోగమించింది. ప్రజలను రేవంత్ ఊహల పల్లకిలో ఊరేగిస్తున్నాడు. రేవంత్ అన్నింటిపై పలాయన వాద వైఖరి అవలంభిస్తున్నాడు. రేవంత్ వి ఉత్తరకుమార ప్రగాల్భాలు. కేసీఆర్ సుస్థిర పాలన అందిస్తే రేవంత్ రాష్ట్రం లో అస్థిరత తెచ్చారు. ప్రజలే స్వచ్చంధంగా ప్రభుత్వం పై తిరగబడుతున్నారు. కేసీఆర్ కట్టిన అంత పెద్ద సచివాలయం ఉండగా పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి సీఎం రేవంత్ ఎందుకు సమీక్షలు చేస్తున్నారు? పోలీస్ పాలన ,మాఫియా పాలన తెచ్చేందుకే రేవంత్ తరచూ కమాండ్ కంట్రోల్ కి వెళ్తున్నారు. రేవంత్ తస్మాత్ జాగ్రత్త ,బీ ఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు సహించం. ఇప్పటికైనా సీఎం హామీల అమలుపై దృష్టి సారించాలి.

వికారాబాద్ రోడ్లను బాగు చేయని సీఎం లక్ష కోట్లు పెట్టుబడులు తెచ్చానని గొప్పలు చెప్పుకుంటున్నారు. సీఎం రేవంత్ కు టీబీ ఏమిటో లెప్రసి ఏమిటో కూడా తెలియడం లేదు. ముందు రోడ్లు బాగు చేయండి. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు లో మోసాలు జరుగుతున్నాయి. బేస్మెంట్ వరకు కట్టుకుంటే డబ్బులు ఇస్తామంటున్నారు. ఎస్సీ ,ఎస్టీల దగ్గర డబ్బులు ఎక్కడివి ? అన్ని పథకాల్లో మోసమే జరుగుతోంది.

తూతూ మంత్రంగా మండలానికో గ్రామంలో పథకాలు ప్రారంభించారు. మునిపల్ వార్డుల్లో ఎక్కడా పథకాలు ప్రారంభం కాలేదు. ఉపాధి హామీ కార్డుతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కు లింక్ పెట్టడం ఏమిటి ? జాబ్ కార్డుతో సంబంధం లేకుండా భూమి లేని కూలీలు అందరికీ పన్నెండు వేల రూపాయల చొప్పున ఇవ్వాలి. రేవంత్ ప్రజలకు ఇచ్చేది తక్కువ ఎగ్గొట్టేది ఎక్కువ అని పథకాలను చూస్తే అర్థమవుతుంది. పథకాలకు అర్హులు కావాలంటే ప్రజలు భూములు అమ్ముకునే పరిస్థితిని రేవంత్ రెడ్డి తెచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి. రిజర్వేషన్లు పెంచక ఎన్ని కలు నిర్వహిస్తే బీసీలు కాంగ్రెస్ నాయకులను గ్రామాలకు రానివ్వొద్దు.

కుంభ మేళా లో జరిగిన తొక్కిసలాట లో భక్తులు మరణించడం దిగ్భ్రాంతి ని కలిగించింది. మృతుల కుటుంబాలకు బీ ఆర్ ఎస్ పార్టీ తరపున సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాం.. మృతుల కుటుంబాలను కేంద్రం ,యూపీ ప్రభుత్వం ఆదుకోవాలి. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలి.




## వైద్య విద్యలో నివాస ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం: సుప్రీంకోర్టు

వైద్య విద్య సీట్లలో నివాస ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించింది. రాష్ట్రంలో నివసించేవారి విషయంలో రిజర్వేషన్ల గురించి ఆలోచించవచ్చని.. అయితే అది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల వరకేనని.. ఆ తర్వాత ఉన్నత విద్యా కోర్సుల విషయంలో నివాస ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే.. ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లే అవుతుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ కీలక తీర్పును జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ సుధాంషు ధులియా జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ఇచ్చింది. రాష్ట్ర కోటా కింద పీజీ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నివాస ఆధారిత రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించింది. మరోవైపు ఇప్పటికే జారీ అయిన నివాస ఆధారిత రిజర్వేషన్లకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు, ఈ కేటగిరి కింద ఇప్పటికే పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులపై ఈ తీర్పు ప్రభావం ఉండదని వెల్లడించింది.




## వచ్చే నెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

**ఉండవల్లి:** అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి 24 నుంచి నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 25 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఫిబ్రవరి నెలాఖరులో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. కాగా కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న సంగతి తెలిసిందే.




## విపత్తుల్లో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడమే లక్ష్యం

- హోం మంత్రి అనిత

**అమరావతి, మహానాడు:** విపత్తులప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. జాతీయ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, ఎయిర్ పోర్ట్ ఆధ్వర్యంలో బుధవారం విశాఖ ఎయిర్ పోర్ట్ లో మాక్ డ్రిల్ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దుబాయ్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై, మాట్లాడారు. మాక్ డ్రిల్స్ నిర్వహణ వల్ల ఆకస్మిక ఆపదలు వస్తే సామర్థ్యం ఎంతో



స్పష్టమవుతుందన్నారు. అందులో ఉన్న లోటుపాట్లను అధిగమించగలమని తెలిపారు. అవగాహన, అప్రమత్తతతోనే విపత్తులను ఎదుర్కోగలమని తెలిపారు.

వ్యక్తిగత పర్యటనలో ఉన్నప్పటికీ మాక్ డ్రిల్ ప్రాముఖ్యత దృష్ట్యా హాజరైన హోంమంత్రి మాట్లాడారు. అత్యవసరంగా స్పందించి క్షతగాత్రులను వేగంగా చికిత్సలు అందించి మరణాలను నిరోధించడంలో కీలకమని, హుద్ హుద్, తిత్లీ తుపాన్లు వచ్చినపుడు సీఎం చంద్రబాబు నాయకత్వంలో వేగంగా తిరిగి నిలబడ్డామని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆపద మిత్ర వాలంటీర్లను తీసుకుని వారికి రెస్క్యూపై శిక్షణ అందించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో క్షేత్రస్థాయిలో విపత్తులను ఎదుర్కొనేలా 14వేల మందికి శిక్షణనిస్తున్నామని, నేవీ, పోలీస్, రెవెన్యూ, జలవనరులు, వైద్య, పంచాయతీ రాజ్, మున్సిపల్ సహా అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ, గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులందరికీ మేలోగా ఈ శిక్షణ పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.



**రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు, గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావులను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిలు ఉన్నారు.**

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 30, జనవరి 2025 ||


# మైనారిటీలకు సబ్ ప్లాన్ అమలు ఎప్పుడు?

- ఇమామ్, మౌజమ్ లకు గౌరవ వేతనాలు పెంచుతామని పెంచలేదు
- బీఆర్ఎస్ నేతలు ఇంతియాజ్ అహ్మద్ ,అబ్దుల్ కలీం, బైకాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్: రేపటితో రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులు పూర్తవుతాయి. రాహుల్ చేతిలో రాజ్యాంగం పట్టుకుని తిరుగుతారు. రేవంత్ పాలనలో మాత్రం రాజ్యాంగం ప్రకారం మైనారిటీలకు రావాల్సిన ప్రయోజనాలు రావడం లేదు. మైనారిటీల గురించి రేవంత్ ప్రభుత్వం లో మాట్లాడేవారు లేరు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మైనారిటీలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నా సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మైనారిటీ డిక్లరేషన్‌లో చెప్పింది ఒక్కటి కూడా అమలు చేయలేదు. మైనారిటీలకు సబ్ ప్లాన్ అమలు చేస్తామని ఇప్పటి వరకు అమలు చేయలేదు. ఇమామ్ ,మౌజం లకు గౌరవ వేతనాలు పెంచుతామని పెంచలేదు ..రావాల్సిన జీతాలు కూడా రేవంత్ ఇవ్వడం లేదు. మైనారిటీలకు నిధులు బడ్జెట్ లో పెట్టినా ఖర్చు చేయడం లేదు.

కాంగ్రెస్‌లో ముస్లిం నాయకులు ఉన్నా మైనార్టీల సమస్యల పై మాట్లాడటం లేదు. ముస్లింలు రేవంత్ ప్రభుత్వం పై పోరాడే సమయం వచ్చింది. కేసీఆర్ హాయంలో మైనార్టీల కోసం గురుకులాలు స్థాపించారు. గురుకులాల్లో చదివిన ముస్లిం విద్యార్థులు ఇపుడు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ లో చదువుతున్నారు. ఇప్పుడు మైనారిటీ గురుకులాల్లో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి.


ఖానాపూర్ ఎమ్మెల్యే ఎద్మ బొజ్జు మైనార్టీల అంతు చూస్తామని బెదిరించినా చర్యలు లేవు. దానం నాగేందర్ ముందు ఓల్డ్ సిటీ లో భవనాలు కూల్చాలని మైనార్టీల మనోభావాలను కించపరిచారు. రేవంత్ మంత్రివర్గంలో ఒక్క మైనార్టీకి కూడా స్థానంలేదు. సెక్యులర్ విలువ లను కాంగ్రెస్ మంట గలుపుతోంది.

మహబూబ్ ఆలం ఖాన్ ఇంట్లో రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు పెద్ద పెద్ద మాటలు మాట్లాడారు.ఆలం ఖాన్ మైనార్టీలకు అన్యాయం జరుగుతున్నా నోరుమెదపడం లేదు. స్థానిక ఎన్నికల్లో మైనారిటీ లు కాంగ్రెస్ కు గట్టిగా బుద్ది చెబుతారు.

# రాజ్యాంగ ముసాయిదా నిర్మాతను మరిచిన పాలకులు

సర్ బెనెగల్ నర్సింగ్ రావు.. సులువుగా బి.ఎన్.రావు..

1887లో 26 ఫిబ్రవరిన పుట్టి 30 నవంబర్ 1953 న పరమపదించారు. ఈయన ఒక సివిల్ సర్వెంట్, న్యాయనిపుణుడు, దౌత్యవేత్త. భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన పూజ్యుడు. ఆ కాలంలోని ప్రముఖ భారతీయ న్యాయ



పుణులలో ఒకరైన బి.ఎన్.రావు 1947లో బర్మా మరియు 1950లో భారతదేశం యొక్క రాజ్యాంగాలను రూపొందించడంలో సహాయ పడ్డారు. అసలు చెప్పాలి అంటే ఇతనే భారత రాజ్యాంగ ముసాయిదా (డ్రాఫ్ట్) రూపకర్త.

రాజ్యాంగం రూపొందించడం కోసం అని 1946 లో రాజ్యాంగ సభకు (CONSTITUENT ASSEMBLY) రాజ్యాంగ సలహాదారుగా (CONDTITUTIONAL ADVISER) ఈయన నియమితులయ్యారు. రాజ్యాంగం యొక్క ప్రజాస్వామ్య ఫ్రేమ్‌వర్క్ యొక్క సాధారణ నిర్మాణానికి అతను బాధ్యత వహించాడు. ఫిబ్రవరి 1948లో దాని ప్రారంభ ముసాయిదాను తయారుచేశాడు. ఈ ముసాయిదా 26 నవంబర్ 1949న భారత రాజ్యాంగ సభ ద్వారా చర్చించబడింది, సవరించబడింది మరియు చివరకు ఆమోదించబడింది.

భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో తన పరిశోధనలో భాగంగా, 1946లో బి.ఎన్.రావు US, కెనడా, ఐర్లాండ్ మరియు యునైటెడ్ కింగ్‌డమ్‌లకు వెళ్లారు, అక్కడ రాజ్యాంగ చట్టంపై న్యాయ మూర్తులు, పండితులు మరియు అధికారులతో వ్యక్తిగత సంప్రదింపులు జరిపారు. ఆ డ్రాఫ్ట్ మరియు ఇతర సవరణలు పై ప్రజల అభిప్రాయాలు, విమర్శలు మరియు సూచనల నేపథ్యంలో పరిశీలన మొదలగు వాటికి ఒక సంవత్సరం పాటు పట్టింది. మూడు ముసాయిదాలు మరియు మూడు పఠనాల తర్వాత, రాజ్యాంగం 26 నవంబర్ 1949న ఆమోదించబడినట్లు ప్రకటించబడింది.

డాక్టర్ BR. అంబేద్కర్ 25 నవంబర్ 1949న రాజ్యాంగ సభలో తన ముగింపు ప్రసంగంలో ఇలా పేర్కొన్నారు:

"నాకు ఇచ్చిన క్రెడిట్ నిజంగా నాది కాదు. ముసాయిదా కమిటీ పరిశీలన కోసం రాజ్యాంగం యొక్క కఠినమైన ముసాయిదాను తయారు చేసిన రాజ్యాంగ సలహాదారు సర్ బి.ఎన్.రావు కు ఇది కొంత వరకు చెందుతుంది" అని పేర్కొన్నారు.

బి.ఎన్.రావు 26 ఫిబ్రవరి 1887న చిత్రాపూర్ సారస్వత్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. అతని తండ్రి బెనెగల్ రాఘవేంద్రరావు ప్రముఖ వైద్యుడు. రావు మంగళూరులోని కెనరా హైస్కూల్ నుండి పట్టభద్రుడయ్యాడు, మొత్తం మద్రాసు ప్రెసిడెన్సీ విద్యార్థుల జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. అతను ఇంగ్లీష్, ఫిజిక్స్ మరియు సంస్కృతంలో ట్రిపుల్ ఫస్ట్ డిగ్రీతో 1905లో పట్టభద్రుడయ్యాడు, మరియు 1906లో గణితంలో అదనపు మొదటి పట్టా పొందాడు. స్కాలర్‌షిప్‌పై అతను కేంబ్రిడ్జ్‌లోని ట్రినిటీ కాలేజీకి వెళ్లాడు మరియు 1909లో తన ట్రిపోస్ తీసుకున్నాడు.

బి.ఎన్.రావు 1909లో ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, బెంగాల్‌కు పోస్టింగ్‌గా భారతదేశానికి తిరిగి వచ్చారు. కార్య నిర్వాహక వర్గంలో బాగా పని చేస్తూ, 1909లో అతను న్యాయ వ్యవస్థకు మారాడు. తూర్పు బెంగాల్‌లోని అనేక జిల్లాల్లో న్యాయ మూర్తిగా పనిచేశాడు.

బి.ఎన్.రావు భారత ప్రభుత్వ చట్టం,1935 ముసాయిదా రూపకల్పనపై భారత ప్రభుత్వ సంస్కరణల కార్యాలయంతో కలిసి పనిచేశాడు. ఆ తర్వాత అతను కలకత్తా హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేశాడు, కానీ భారత ప్రభుత్వం అతనికి అప్పగించిన రెండు అదనపు ప్రాజెక్టుల కారణంగా, అతని పదవీకాలానికి అంతరాయం కలిగింది. అతను మొదట రైల్వేలో వేతనాలు, పని పరిస్థితులకు సంబంధించిన విచారణ కోర్టుకు అధ్యక్షత వహించాడు. భారతదేశంలో, ఆపై హిందూ చట్టానికి సంబంధించిన సంస్కరణలపై కమీషన్ లో పని చేసాడు. 1942లో నదీతీర హక్కులపై నివేదికను సమర్పించిన సింధు జలాల కమిషన్‌కు అధ్యక్షుడిగా కూడా అతను మళ్లీ నియమించబడ్డాడు.

అతని విశిష్టమైన సేవలకు అతనికి 1934 న్యూ ఇయర్ ఆనర్స్ లిస్ట్ లో కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్ (CIE)ని, 1938లో నైట్ హుడ్‌ని తెచ్చిపెట్టింది. రావు 1944లో సర్వీస్ నుండి రిటైర్ అయ్యాడు. ఆపై జమ్మూ కాశ్మీర్ రాచరిక రాష్ట్ర మంత్రి. అతను 1945లో అప్పటి కాశ్మీర్ మహారాజాతో విభేదాల కారణంగా ఈ పదవికి రాజీనామా చేశారు.

రాజ్యాంగ పూర్వాపరాలు మరియు భారతదేశంలోని మానవ హక్కులపై రచనలు చేశారు. అతను కొంత కాలం (1944-45) జమ్మూ మరియు కాశ్మీర్ రాష్ట్ర మంత్రిగా పనిచేశాడు. ఫిబ్రవరి 1952 నుండి అతని మరణం వరకు, అతను హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానంలో న్యాయమూర్తిగా ఉన్నారు. ఈ కోర్టుకు ఎన్నికయ్యే ముందు, అతను ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ అభ్యర్థిగా నియమించడానికి కూడా పరిగణించబడ్డాడు.

ఈయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1988లో ఈయన పేరు మీద తపాలా బిళ్ళ విడుదల చేసింది. రాజ్యాంగానికి అసలు డ్రాఫ్ట్ రాజ్యాంగం లేదా ముసాయిదా రాజ్యాంగం ఎవరు రచించారో కూడా మన చరిత్ర పాఠ్యాంశాలలో కనీసం పేర్కొనలేదు.

**వందేమాతరం.. భారత్ మాతాకీ జై**

# రేవంత్.. వేరుశనగ రైతుల ఆందోళన కనిపించడం లేదా?



- ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్: అసలే దిగుబడి లేక సతమతమవుతున్న రైతుకు గిట్టుబాటు ధర కూడా రావడం లేదు. ఒకపక్క వ్యాపారుల మోసం, మరొపక్క ప్రభుత్వం శీతకన్ను వేయడం వల్ల వేరుశనగ రైతుల ఆందోళనతో మహబూబ్ నగర్ జిల్లా అట్టుడుకుతోంది.పోలీసుల బందోబస్తు నడుమ వేరుశనగ కొనుగోలు జరపాల్సిన దుస్థితి రావడం దారుణం. రైతుల పాలిట రాబందుగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతాంగం క్షమించబోదు. కాంగ్రెస్ పాలన రైతుల పాలిట శాపంగా మారింది.తక్షణమే ప్రభుత్వం మేల్కొని వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా మార్కెట్ యార్డుల్లో వ్యాపారులు, కమిషన్ దారుల ఆగడాలను అరికట్టాలి.

# 'పెద్దిరెడ్డి' సంగతి తేల్చండి!

## అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం

అమరావతి, మహానాడు: చిత్తూరు జిల్లా మంగళంపేట సమీపంలోని అడవుల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబం అటవీ భూములు ఆక్రమించారని వెలువడిన సమాచారంపై సమగ్రంగా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అటవీ శాఖ ఉన్నతాధికారులను ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. అటవీ భూములు ఏ మేరకు ఆక్రమించారు,





అక్కడ ఉన్న అడవులను ఏ విధంగా ధ్వంసం చేశారో విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. పుంగనూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న అటవీ భూముల వివరాలు, వాటి రికార్డులను పరిశీలించాలని, ఏ మేరకు ఆక్రమణలకు గురయ్యాయో నిగ్గు తేల్చాలని చెప్పిన పవన్ ఆదేశించారు. అటవీ భూముల రికార్డులు ఎక్కడైనా తారుమారు చేశారా? చేసిన పక్షంలో అందుకు బాధ్యులెవరూ? తద్వారా లబ్ధి పొందింది ఎవరు అనేది నివేదికలో పేర్కొనాలని స్పష్టీకరించారు. అటవీ భూములు ఆక్రమించిన వారిపై చట్టపరంగా ముందుకు వెళ్లాలని, సత్వరమే ప్రాథమిక నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

# సీఎం గారూ.. తెలంగాణ ఇజ్జత్ పోతోంది సారూ!

- హవ్వ.. సీఎం హామీలే అమలుచేయరా?
- రేషన్ కార్డులపైన ప్రధానమంత్రి ఫోటోను ఉంచాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ



హైదరాబాద్: "సీఎం గారూ.. తెలంగాణ ఇజ్జత్ పోతోంది సారూ.. మీరు ఇచ్చిన హామీలే అమలుకాకపోతే, బయట రాష్ట్రాల దృష్టిలో తెలంగాణ పరువుపోదా? చేసుకుంటున్న ఉత్తుత్తి ప్రచారం చాలు. మీపాలనకు 420 రోజులాయె. ఇకనయినా మీరిచ్చిన ఆరు హామీలు వెంటనే అమలు చేయండి" అని కేంద్రమంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఘాటు లేఖ సంధించారు.

సంజయ్ లేఖ పూర్తి పాఠమిది.. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇండ్లు, రేషన్ కార్డులను అర్హులందరికీ అందించకపోవడం దారుణం. రాష్ట్రంలో 12,991 గ్రామ పంచాయతీలుండగా, మండలానికి ఒక గ్రామం చొప్పున 561 గ్రామాలను మాత్రమే ఎంపిక చేయడమేంది? రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 70 లక్షల మంది రైతులుంటే, నేటి వరకు 65 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బులే జమ చేయకపోవడం బాధాకరం.

10 లక్షల మంది వ్యవసాయ కూలీలుంటే నేటికీ 9 లక్షల 80 వేల మంది రైతుల ఖాతాల్లో డబ్బులు వేయకపోవడమేంటి? 40 లక్షల కొత్త రేషన్ కార్డులిస్తామని 42 వేల 267 మందిని మాత్రమే గుర్తించడం హాస్యాస్పదం. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల కుటుంబాలు అర్హులైనప్పటికీ, నేటికీ ఒక్కరంటే ఒక్కరికి కూడా ఇంటిని నిర్మించకపోవడం సిగ్గు చేటు. ఇండ్ల నిర్మాణం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.7 వేల కోట్లకుపైగా కేటాయింపులు చేసినా నేటికీ నయాపైసా ఖర్చు చేయకపోవడం దారుణం. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ముఖ్యమంత్రులు ప్రజలకు ఒక మాట ఇచ్చారంటే అదే శాసనంగా అమలయ్యేది

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక నాటి సీఎం కేసీఆర్, నేటి సీఎంగా ఉన్న మీరు హామీలను నిలబెట్టుకోలేకపోవడం బాధాకరం. సీఎం హామీలు అమలు కాలేదంటే ముఖ్యమంత్రి పదవికే కళంకం. సీఎం హామీలనే అమలు చేయలేకపోతే, మీ ఆధ్వర్యంలో పనిచేసే అధికారులు ఏ విధంగా జవాబుదారీ తనంతో పనిచేయగలరు? తెలంగాణ సీఎం హామీలు అమలు కాలేదంటే దేశం దృష్టిలో తెలంగాణ సమాజాన్ని పలుచన చేయడమే.

6 గ్యారంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారు. ఇకనైనా వెంటనే అర్హులైన వారందరికీ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇండ్లను అందించాలి. కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తోంది. తెలంగాణ ప్రజలందరికీ తెలిసేలా రేషన్ షాపుల వద్ద, రేషన్ కార్డులపైన ప్రధానమంత్రి ఫోటోను ఉంచాలి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా మంజూరయ్యే ఇండ్లకు ఆ పేరును యధాతథంగా కొనసాగించాలి. లేనిపక్షంలో ప్రజా తిరుగుబాటు తప్పదు. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

# రాష్ట్రానికి గత 7 నెలల్లో రూ. 6.3 లక్షల పెట్టుబడులు తెచ్చాం

- మంత్రి పార్థసారథి వెల్లడి



అమరావతి: గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేయాగా సియం చంద్రబాబు నేత్వంలోని కూటమి ప్రభుత్వం మరలా రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు పెద్దఎత్తున కృషి చేయడం జరుగుతోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. బుధవారం రాష్ట్ర సచివాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.

రాష్ట్రాభివృద్ధిని శరవేగంగా ముందుకు తీసుకు వెళ్ళేందుకు గత ఏడు నెలల్లో రాష్ట్రానికి రూ.6.33 లక్షల కోట్ల రూ.ల పెట్టుబడులకు సంబం ధించి వివిధ కంపెనీలతో ఎంఓయులు కుదుర్చుకోవడం జరిగిందని తద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయ త్నాలు మొదలయ్యాయని తెలిపారు. ముఖ్యంగా విశాఖలో టిసిఎస్, ఎన్టిపిసి,ఆర్సిలర్ మిట్టల్, హెచ్ పి సి, రిలయన్స్ వంటి కంపెనీలు భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టనున్నాయని చెప్పారు.

గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలను తెల్సుకోకుండా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నీతిఆయోగ్ ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇస్తే దానిపై విమర్శలు చేయడం సరికాదని ఖండించారు.ఒక వ్యక్తి మూర?త్వ పాలనతో ఏరాష్ట్రమైనా దేశమైనా ఏవిధంగా నష్టపోతుందనేకు గత ప్రభుత్వ పాలనే నిదర్శనమని పేర్కొన్నారు. అంతేగాక రాష్ట్రానికి ఆదాయాన్ని పెంపొందించాల్సిన వారు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతి పాలు చేసి సుమారు 10 లక్షల రూ.ల అప్పుల ఊబిలోకి నెట్టేసారని మంత్రి పార్థసారథి అన్నారు.

గత ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీఇంబర్సుమెంట్ కు సంబంధించి రూ.2800 కోట్లు, అంగన్ వాడీల్లో చిన్న పిల్లలకు అందించే చిక్కీలు, గ్రుడ్లుకు సంబంధించి రూ.1700 కోట్లు, ఉద్యోగులకు సంబంధించి రూ.20వేల కోట్లు బకాయిలు చెల్లించలేదని వివరించారు.అదే విధంగా గృహ నిర్మాణానికి సంబంధించి రూ.7వేల 800 కోట్లు,ఉపాధి హామి పథకానికి రూ.2100 కోట్లు బకాయిలు పెట్టివెళ్ళిందన్నారు.అంతేగాక ఆరోగ్యశ్రీకి సంబంధించి కూడా పెద్దఎత్తున బకాయిలు చెల్లించలేదని తెలిపారు.రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా సకాలంలో సొమ్ము చెల్లించ లేదని చెప్పారు.

గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం మొత్తం కుదేలైందని, గతంలో చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులన్నిటీ ఎక్కడికక్కడే నిలిపే వేయడం జరిగిందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ కు జీవనాడైన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అన్నారు.ఈకూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చాక పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు రూ.15వేల కోట్లను కేంద్రం నుండి మంజూరు చేయించుకో గలిగామని తెలిపారు. అమరావతి రాజధాని పనులన్నిటనీ గత ప్రభుత్వం పూర్తిగా ప్రక్కన పెట్టి పూర్తిగా నిర్లక్ష్యం చేయడమేగాక మూడు రాజధానుల పేరిటి నాటకమాడుతూ అసలు రాష్ట్రానికి రాజధానే లేకుండా చేసిందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.కాని ఈకూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చిన 7 మాసాల్లోనే ప్రపంచ బ్యాంకు,హడ్కో,జైకా తదితర సంస్థల ద్వారా 31వేల కోట్ల రూ.లను సాధించుకోగలిగామని చెప్పారు.

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం మరో పెద్ద హామీ అయినా దీపం పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడం జరుగుతోందని దానివల్ల 90 లక్షల మందికి లబ్ది చేకూరుతోందని మంత్రి తెలిపారు.గడిచిన ఏడు నెలల్లో 7 ఏళ్ల అభివృద్ధిని చేసి చూపించిన దార్శనికుడు చంద్రబాబు నాయుడని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు పూర్తి కాని,మరమ్మత్తులు చేయలేని గ్రామ,పట్టణ, రాష్ట్ర రహదారులను పూర్తి చేసి గుంతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలం దిస్తున్నామని చెప్పారు.

ఓ వైపు అప్పుల కుప్ప, మరో వైపు గత ప్రభుత్వ బకాయిల తట్ట దర్శనమిస్తున్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతోందీ ఈ ప్రభుత్వమన్నారు.1000 పెన్షన్‌ను పెంచడానికి గత ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది కానీ సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజునే రూ.3 వేలు ఉన్న సామాజిక పెన్షన్‌ను రూ.4 వేలు చేశారన్నారు.ఇచ్చిన హామీ మేరకే ప్రతీ నెల ఒకటో తేదీనే ఇంటి వద్దకే పెన్షన్ పంపిణీ జరుగుతోందని తెలిపారు.

ప్రతీ ఏటా మెగా డీఎస్సీ ప్రకటిస్తానని హామీ ఇచ్చి ఒక్క ఏటా కూడా డీఎస్సీని పూర్తి చేయకుండా హామీని గాలికి వదిలేశారని కానీ సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజునే డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీ ఫైలుపై సంతకం చేశారని గుర్తు చేశారు.పేదవానికి అన్నం పెట్టే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం మూసివేస్తే ఈప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని పునరుద్ధరించడం జరిగిందని మంత్రి పార్థసారథి చెప్పారు.

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను ప్రవేటీకరించకుండా నివారించేందుకు గత ప్రభుత్వం కనీస ప్రయత్నాలు చేయలేదని కాని కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రవేటీకరణ కాకుండా అనేక ప్రయత్నాలు చేయడం జరిగిందని అంతేగాక దానికి రివైవల్ ప్యాకేజి కింద కేంద్రం నుండి 11వేల 500 కోట్ల రూ.లను సాధించుకోగలిగామని అన్నారు. అంతేగాక విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే శంఖుస్థాపన జరిగిందని తెలిపారు.రాష్ట్రంలో ఐదేళ్ళలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా,ప్రతి ఇంటిలో ఒక ఎంటర్ప్రెన్యూర్ ను తీర్చిదిద్దే లక్ష్యంగా ఈకూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

# కృత్రిమ మేధ (ఏఐ)తో ఇందిరమ్మ ఇండ్ల పథకం

- మంజూరైన ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి
- ఇందిరమ్మ ఇండ్ల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎలాంటి అక్రమాలకు, అవినీతికి తావులేకుండా లబ్దిదారులకు మేలు చేకూరేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్లపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో బుధవారం నాడు మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ లబ్దిదారుల ఎంపిక నుండి ఇండ్ల నిర్మాణం పూర్తయ్యేవరకూ కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్- ఎఐ) వాడుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక చేపట్టేందుకు ఇప్పటికే ప్రత్యేక యాప్‌ను రూపొం దించి సర్వే నిర్వహించడం జరిగిందని ఇండ్ల నిర్మాణం, చెల్లింపులలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా రాష్ట్రంలో ఎక్కడినుంచైనా రోజువారీగా ఇండ్ల నిర్మాణ పురోగతిని పర్యవేక్షించేలా ఏఐని ఉపయోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు.

నిజమైన నిరుపేదలను గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామన్నారు. మొబైల్ యాప్ ద్వారా నిర్వహించిన సర్వే వివరాలను క్లౌడ్ ఆధారిత కృత్రిమ మేధస్సు ( ఎ.ఐ) టెక్నాలజీతో సరిపోలుస్తూ అనర్హులను గుర్తించి అర్హులను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఇండ్ల నిర్మాణానికి సంబంధించి నాలుగు దశల్లో చెల్లింపులు చేస్తామని, ఈ చెల్లింపుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా ఎప్పటి కప్పుడు చెల్లించేలా ఏఐ టెక్నాలజిని వాడుకోవాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. రాజకీయ ప్రమేయానికి తావు లేకుండా, ఇతర ప్రభావిత విభాగాల జోక్యం లేకుండా లబ్దిదారుల ఎంపిక జరిగేలా ఈ విధానాలు సహకరిస్తాయని, అనర్హులు ఎవరైనా ఉంటే పూర్తిగా గుర్తించే అవకాశాలు ఈ నూతన సాంకేతిక విధానం వలన సాధ్యపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన 4 ప్రతిష్టాత్మక పథకాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒకటి. దీనిలో తొలి విడతగా నివాస స్థలం కలిగిన 72 వేల మంది లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేయడం జరిగిందని ఈ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తొలివిడత ఇండ్ల మంజూరులో అత్యంత నిరుపేదలు, వికలాంగులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు.

ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధిలో యువత భాగస్వామ్యం ముఖ్యం : మంత్రి ఎన్ఎండి ఫరూక్

అమరావతి, మహానాడు: సమాజాభివృద్ధిలో యువత భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రజలకు సేవలు అందించడంలో యువత స్ఫూర్తిదాయకంగా నిలవాలని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. గతేడాది చోటు చేసుకున్న బుడమేరు వరద బీభత్సంతో అతలాకుతలమైన విజయవాడలో ప్రజలకు రాత్రింబవళ్లు సేవాస్ఫూర్తితో సేవలు అందించిన 427 మంది యువతకు మంత్రి ఫరూక్ ప్రశంసా పత్రాలు అందజేశారు. బుధవారం సచివాలయంలోని న్యాయ మైనార్టీ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

బుడమేరు ముంపు ప్రాంతాలలో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సత్వరమే అండగా నిలిచేందుకు తాను ఇచ్చిన పిలుపుతో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లి ఆధ్వర్యంలో సమితి బృంద సభ్యులు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అభినందనీయమని మంత్రి అన్నారు. యువత సేవలను అభినందిస్తూ వారికి ప్రశంసా పత్రాలను అందజేసి భవిష్యత్తులో కూడా సమాజాభివృద్ధిలో, ప్రజా సంక్షేమం కోసం యువత తన వంతు కృషి చేయాలని మంత్రి



సూచించారు. బుడమేరు వరద ముంపు ప్రాంతాలలో సేవలందించిన 427 మంది స్కౌట్, జమీయాత్ యూత్ సభ్యులను అభినందించారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మైనార్టీ సంక్షేమ కార్యక్ర మాలపై రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమీక్షించారు. బుధవారం మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్, మైనారిటీ సంక్షేమ శాఖ కమీషనర్ సిహెచ్ . శ్రీధర్ లతో చర్చించారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 30, జనవరి 2025



## లక్షల డప్పులు వేల గొంతులు కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్‌ని ఆహ్వానించిన మందకృష్ణ మాదిగ



హైదరాబాద్: ఫిబ్రవరి 7న హైదరాబాద్ నగరంలో నిర్వహించబోయే లక్ష డప్పులు- వేల గొంతులు కార్యక్రమానికి రావాల్సిందిగా మందకృష్ణ మాదిగ, కాంగ్రెస్ నేత మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ నివాసానికి వెళ్లి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్, మంద కృష్ణ మాదిగ కి పద్మశ్రీ పురస్కారం వచ్చిన సందర్భంగా శాలువా తో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతి ప్రయోజనాల కోసం అందరం కలిసికట్టుగా ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఉంటామని. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు వెలుబడిన వెంటనే దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో వర్గీకరణ చేపడాతాం అని ప్రకటిం చారని, దానికి అనుగుణంగానే ప్రభుత్వంతో వర్గీ కరణ చేయించే బాధ్యత తనదే అని మాజీ మంత్రి కాంగ్రెస్ నేత డాక్టర్ ఏ చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. లక్షల డప్పులు లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేయబోతున్నది అని ఫిబ్రవరి 7న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి లక్షలాది మంది స్వచ్ఛంద తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్

- 22 మంది విద్యార్థినులకు అస్వస్థత
- తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వని అధికారులు

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. దీంతో వసతి గృహానికి చెందిన 22 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థినులకు ఒక్కసారిగా వాంతులు అయ్యాయి. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు సమాచారం. విద్యార్థినులకు ఆసుపత్రి పాలైనా తల్లిదండ్రులకు మాత్రం సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వలేదు. వారంతా ఎక్కడ చికిత్స పొందుతున్నారనే సమాచారం కూడా ఇచ్చేందుకు ఇష్టపడలేదు.

## ప్రకాష్‌రాజ్ ప్రయాగరాజ్ స్నానం ఉత్తిదేనట!

- ఖండించిన ఫ్యాక్ట్ చెక్



హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడు ప్రకాష్‌రాజ్ ఇటీవల కుంభమేళా సందర్భంగా ప్రయాగరాజ్‌లో స్నానం చేశారంటూ సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు ఉత్తిదేనట. ఆ మేరకు ఫ్యాక్ట్ చెక్ పేరుతో అదే సోషల్ మీడియాలో ఒక పోస్టు విడుదలయింది. హిందుత్వాన్ని వ్యతిరేకించే సెక్యులరిస్టు అయిన ప్రకాష్‌రాజ్, ప్రయాగరాజ్‌కు వెళ్లి స్నానం ఎలా చేశారంటూ నెటిజన్లు ప్రశ్నించిన విషయం తెలిసిందే. దానితో రంగంలోకి దిగిన ఫ్యాక్ట్‌చెక్.. అదంతా ఉత్తిదేనని, దానికి కారకులైన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆ వార్తలో పేర్కొంది. సో.. ప్రకాష్‌రాజ్ ప్రయాగరాజ్‌లో స్నానం చేయలేదన్నమాట. బహుశా అది ఏఐతో రూపొందించిన చిత్రంగానీ, లేదా ఏదైనా సినిమా సన్నివేశానికి సంబంధించినది గానీ అయి ఉండవచ్చని భావిస్తున్నారు.

## కెకెకు ఆ భూమిని తక్కువకే ఎలా ఇస్తారు?

- హైకోర్టులో పిటిషన్
- ప్రతివాదులుగా మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీపీఏ హోల్డర్ కవిత



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపి కె.కేశవరావు చిక్కుల్లో పడ్డారుబంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీ నగర్‌లో భూమిని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు కుటుంబ సభ్యులకు తక్కువ ధరకు కట్టబెట్టారంటూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ భూమిని జీవో నంబర్ 56 ద్వారా కె.కె. కుటుంబానికి క్రమబద్ధీకరించారని, రఘువీర్ రెడ్డి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా రెవెన్యూ అధికారులు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీపీఏ హోల్డర్ కవితలను చేర్చారు. ఈ భూమిని తక్కువ ధరకు కేటాయించారని, ఈ స్థల కేటాయింపునకు సంబంధించిన జీవోను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. హైకోర్టు తదుపరి విచారణను ఫిబ్రవరి 27కు వాయిదా వేసింది.

## సింగర్ మధుప్రియ సాంగ్ షూటింగ్ వివాదంలో అధికారులపై వేటు

- శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం ఈవో మారుతి బదిలీ

జయశంకర్ భూపాలపల్లి: శ్రీకాళేశ్వర ముక్తేశ్వర దేవాలయంలో సింగర్ మధుప్రియ సాంగ్ షూటింగ్ వివాదంలో మీడియా ప్రసారం చేసిన కథనాలపై తెలంగాణ దేవాదాయశాఖ స్పందించింది. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం ఈవో మారుతిపై బదిలీ వేటు పడింది. ఆలయ ఈవోను కరీంనగర్ జిల్లా మానుకొండూర్ గుట్టుదుద్దనపల్లి శ్రీఆంజనేయస్వామి ఆలయానికి దేవాదాయశాఖ



అధికారులు బదిలీ చేశారు.

మారుతి స్థానంలో కాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయానికి గతంలో ఈవోగా పనిచేసి కొడవటంచ లక్ష్మీనరసింహ దేవస్థానానికి బదిలీ అయిన గ్రేడ్-1 అధికారి మహేశ్‌కు మళ్లీ బాధ్యతలు అప్పగించారు.

అలాగే షూటింగ్ సమయంలో విధుల్లో ఉన్న అర్చకుడు రామకృష్ణకు అధికారులు నోటీసులు జారీ చేశారు. కాగా, ఈనెల 20న అనుమతి లేకుండా ముక్తేశ్వర ఆలయ గర్భగుడిలో సింగర్ మధుప్రియ ప్రైవేటు ఆల్బమ్ షూటింగ్ చేశారు. దీనిపై తీవ్ర వివాదం చెలరేగింది. సాధారణంగా కాళేశ్వర ఆలయంలో ఫొటోలు, వీడియోలు తీయడానికి అనుమతి ఉండదు.

కానీ, ఎలాంటి అనుమతులు లేకుండా మధుప్రియ పాటలు చిత్రీకరించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్న ఈ వివాదంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఘటనపై మీడియా వరస కథనాలు ప్రచురించింది. దీంతో దేవాదాయశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు..





## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక గ్రీవెన్స్‌లు

- వైసీపీ పాలనలో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన సమస్యలు
- మనుబోలులో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి
- అర్జీలు సమర్పించేందుకు వందలాదిగా తరలివచ్చిన ప్రజానీకం
- అందరిసమస్యలను ఆలకించి, అర్జీలు స్వీకరించడంతో పాటు ప్రతి విన్నపాన్ని ఆన్ లైన్ చేయించిన సోమిరెడ్డి

సర్వేపల్లి: మనుబోలు నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్న ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు ఇప్పటికే వెంకటాచలం, పొదలకూరు మండలాల్లోనూ ఈ కార్యక్రమాలు పూర్తి చేశాం. ఇప్పటి వరకు ఆన్ లైన్ లో సుమారు 3 వేల వరకు అర్జీలు నమోదయ్యాయి. అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై సమీక్షలు నిర్వహించుకుంటూ సమస్యలు పరిష్కరించాలి. త్వరలోనే తోట పల్లి గూడూరు, ముత్తుకూరు మండలాల్లోనూ స్పెషల్ గ్రీవెన్సులు నిర్వహిస్తాం.

సర్వేపల్లి నియోజకవర్గంలో వేలాది సమస్యలు పేరుకు పోవడం దురదృష్టకరం. ఎక్కువ శాతం అర్జీలు పింఛన్లు రావడం లేదని, ఇళ్ల స్థలాలు లేవని, ఇళ్లు మంజూరు చేయాలని కోరడంతో పాటు భూఆక్రమణలు, భూసమస్యల గురించే వస్తున్నాయి. ప్రతి ఊరిలో సచివాలయం ఉద్యోగులు 10 మందిపైగా ఉన్నా సమస్యలు ఇలా ఎందుకు పేరుకుపోయాయో అర్థం కావడం లేదు. అర్జీదారులు, బాధితుల్లో ఎక్కువ శాతం మంది గిరిజనులు, దళితులు ఆ తర్వాత బీసీలే. వైసీపీ ఐదేళ్ల పాలనలో పేదలు నలిగిపోయారు. గిరిజనులు కనీసం ఆధార్ కార్డులు పొందలేక పోయారు..పింఛన్లకు దూరమైపోయారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు పెత్తనాలు చేసి ఇష్టానుసారంగా భూరికార్డులు మార్చేసుకోవడంతో సమస్యలు పెరిగిపోయాయి. ఇకపై అలా జరిగే ప్రసక్తే లేదు. వైసీపీ పాలనలో జరిగిన తప్పులన్నింటిని సరిదిద్దుతాం.



## ఐదు గ్యారంటీలతో కాంగ్రెస్ మేనిఫెస్టో

- నగరం అంతటా 100 ఇందిరా క్యాంటీన్‌ల ఏర్పాటు
- కేవలం 5కే భోజనం
- ఢిల్లీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల

ఢిల్లీ: మరోవారం రోజుల్లో ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ క్రమంలో పార్టీలు హోరాహోరీగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా పార్టీలు ప్రజలకు తాయిలాలు ఎర వేస్తున్నారు. అధికారంలోకి వస్తే తామేం చేస్తామో చెబు తూ ప్రజలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాయి.ఈ మేరకు కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ నేపధ్యంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు నెలవారీ భత్యం ? 2,500 మరియు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను హామీ ఇచ్చింది. అదనంగా, ఢిల్లీ నివాసితులకు ?25 లక్షల విలువైన వైద్య చికిత్సను ఉచితంగా అందిస్తామని కాంగ్రెస్ ప్రతిజ్ఞ చేసింది. యువ ఓటర్లను ఆకర్షించ డానికి, ట్రైనీలకు నెలవారీ ?8,500 స్టైఫండ్‌తో పాటు ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలలో ఒక సంవత్సరం అప్రెంటిస్‌షిప్ ఇస్తామని పార్టీ హామీ ఇచ్చింది. నగరం అంతటా 100 ఇందిరా క్యాంటీన్‌లను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది,

## ఏపీని జగన్ అప్పుల ఊబిలో ముంచేశాడు

- జగన్‌పై మంత్రి సవిత ఫైర్
- రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం
- మరో రూ.లక్షా 40 వేల కోట్ల బకాయిలు
- 7 నెలల్లో రూ.22 వేల కోట్ల బకాయిలు చెల్లించిన సీఎం చంద్రబాబు : మంత్రి సవిత

అమరావతి: ఒక్కసారి ఛాన్స్ అంటూ బీద అరుపులకు చలించి ఆంధ్రప్రదేశ్ ప్రజలు అవకాశమిస్తే... రాష్ట్రాన్ని అప్పులు ఊబిలో ముంచేసి ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించారని జగన్ రెడ్డిపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అయిదేళ్లలో కాలంలో జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేయగా, లక్షా 40 వేల కోట్ల రూపాయల మేర బకాయిలు పెట్టిందని, ఇప్పుడవి తమ ప్రభుత్వానికి గుది బండగా మారితే, ప్రజలకు శాపంగా పరిణమించాయని విరుచుకుపడ్డారు.

ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడు నెలల కాలంలో జగన్ ప్రభుత్వం బకాయి పెట్టిన ఆరోగ్యశ్రీ, ధాన్యం, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు రూ.22 వేల కోట్లను సీఎం చంద్రబాబు నాయుడు చెల్లించారన్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక అసమర్థుడు పాలన వల్ల రాజ్యం ఎంతమేర నష్టానికి గురవుతుందో ఏపీని చూస్తే ఇట్టే అర్థమవుతుందన్నారు. 5 ఏళ్ల జగన్ పాలన వల్ల రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లడమే కాకుండా, అన్ని వ్యవస్థలూ నిర్వీర్యమై పోయాయన్నారు.

ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దివాళా తీసిందన్నారు. తన అసమర్థత, తుగ్లక్ నిర్ణయాలతో పాటు జల్సాలు, ఆడంబరాలు, ప్రచారయావ కోసం లక్షల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మంత్రి సవిత మండిపడ్డారు. 5 ఏళ్ల కాలంలో జగన్ రూ.10 లక్షల కోట్లు అప్పులు చేస్తే..వాటి అసలు,



వడ్డీ తీర్చడానికి ఏడాదికి రూ.71 వేల కోట్లు అవసరమవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు.

అయిదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు రూ.1.40 లక్షల కోట్ల బకాయి పెట్టారని మంత్రి సవిత వెల్లడించారు. ఫీజు రియంబర్స్ మెంట్ కింద రూ.3,282 కోట్లు, చిక్కిలు, కోడి గుడ్లకు రూ.256 కోట్లు, వసతి దీవెనకు రూ.989 కోట్లు మేర జగన్ బకాయి పెట్టారన్నారు. ఆరోగ్యశ్రీకి రూ.1800 కోట్లు, ధాన్యం కొనుగోలుకు రూ.1600 కోట్లు, ఇరిగేషన్ కాంట్రాక్టర్లకు రూ.19 వేల కోట్లు, గృహ నిర్మాణానికి రూ.7,800 కోట్లు, ఉపాధి హామీకి రూ.2,100 కోట్లతో పాటు ఉద్యోగులకు రూ.20 వేల కోట్ల మేర బకాయిలు పెట్టారన్నారు.అయిదేళ్ల పాలనలో జగన్ రెడ్డి తన జల్సాలకు, విలాసాలకు, ప్రచార యావకు రూ.19,871 కోట్లు ప్రజా ధనాన్ని దుర్విని యోగం చేశారని మంత్రి సవిత మండిపడ్డారు. సచివాలయాలకు వైసీపీ రంగులు వేయడానికి రూ.3 వేల కోట్లు ఖర్చు చేశారని వెల్లడించారు. సర్వే రాళ్లపై తన బొమ్మ కోసం రూ.700 ఖర్చు చేసిన ప్రబుద్ధుడు జగన్ అని ఆగ్రహం వ్యక్తంచేశారు. విశాఖలోని రుషికొండపై విలాసంతమైన భవన నిర్మాణానికి రూ.600 కోట్లు ఖర్చు చేశారన్నారు.

ప్రకటనల పేరుతో తన సొంత పత్రిక సాక్షికి రూ.500 కోట్లు దోచిపెట్టారన్నారు. తాడేపల్లిలోని తన ప్యాలెస్ వద్ద 986 మంది పోలీసు సిబ్బందిని సెక్యూరిటీ పెట్టుకుని రూ.వెయ్యి కోట్లు వెచ్చించారన్నారు. తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ ఇనుప ఫెన్సింగ్ కోసం రూ.12.85 కోట్లు, ప్రహరీ నిర్మాణానికి రూ.10 కోట్లు, ప్యాలెస్ ముందు రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు, పట్టాదారు పాస్ పుస్తకాలపై తన ఫొటో వేయడానికి రూ.13 కోట్లు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన ఘనుడు జగన్ రెడ్డి అని మంత్రి సవిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

కేవలం 5 ఏళ్ల పాలనా కాలంలో ప్రజలిచ్చిన అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని రూ.8 లక్షల కోట్ల జగన్ రెడ్డి ప్రజాధనాన్ని లూటీ చేశారని మంత్రి సవిత ఆరోపించారు. భూ కేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ కు అనుమతులివ్వడంలో...ఇలా ప్రతీ దాంట్లోనూ చేతివాటం చూపుతూ లక్షల కోట్లు కొల్లగొట్టారని మండిపడ్డారు. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు, రేషన్ బియ్యం పంపిణీలోనూ చేతివాటం చూపారన్నారు. కేవలం జే ట్యాక్స్ పేరుతో వేల కోట్లు దోచేశారన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, ఇళ్ల స్థలాల కొనుగోలు, మద్యం అమ్మకాలు, 22(ఏ), అసైన్డ్ భూముల కుంభకోణాల పేరుతో లక్షల కోట్లు కూడబెట్టుకున్నారని మంత్రి సవిత ఆరోపించారు.

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో అధికారం చేపట్టిన సీఎం చంద్రబాబుపై ఏపీ అప్పులతో బకాయిలు గుదిబండగా మారాయని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు. జగన్ అసమర్థత కారణంగా ఒకవైపు బకాయిలు చెల్లిస్తూనే, అసలు, వడ్డీ కూడా తమ ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. గడిచిన ఏడు నెలల్లో రూ.22 వేల కోట్లను ఫీజు రియింబర్స్ మెంట్, ధాన్యం కొనుగోలు, ఆరోగ్య శ్రీ బకాయిలను సీఎం చంద్రబాబునాయుడు చెల్లించారన్నారు.

## భూమి-విత్తనానికి ఉన్న సంబంధం.. రైతు- కాంగ్రెస్ పార్టీది


- బిఆర్ఎస్ ప్రకటించిన లక్షను కూడా ఏకకాలంలో రుణమాఫీ చేయకపోవడంతో రైతులపై పడిన వడ్డీభారం 11,145 కోట్లు.
- నాట్లు వేసే సమయం కాదు.. కోతల సమయానికి కూడా రైతు బంధు అందించని బిఆర్ఎస్
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్: భూమికి, విత్తనానికి ఉన్న సంబంధం.. రైతు, కాంగ్రెస్ పార్టీది. రైతు కష్టాన్ని కాంగ్రెస్ పార్టీ అర్థం చేసుకున్నంతగా ఏ పార్టీ అర్థం చేసుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన డిసెంబర్ 7, 2023 నుండి ఈ క్షణం వరకు రాష్ట్ర వ్యవసాయ రంగ ముఖ చిత్రాన్ని మార్చాలనే దీక్షతో పని చేస్తుంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన వ్యవసాయ రంగాన్ని తిరిగిలో గాడిలో పెట్టేందుకు ఏడాదిలోనే రైతు సంక్షేమానికి రూ.54,280 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ధాన్యం కొనకుండా వరి వేస్తే ఉరి అని బెదిరిస్తే వరికి రూ.500 బోనస్ ఇస్తామనే ప్రకటనతో ఈ ఏడాది వరి సాగులో పంజాబ్ ను వెనక్కి నెట్టి 1.53 కోట్ల టన్నుల దిగుబడితో దేశంలోనే తెలంగాణ టాప్ నిలిచింది. వరికి బోనస్ రూపంలో రైతులకు రూ.1154.40 కోట్లు అందజేశాం.

అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే "రైతు రుణమాఫీ" "వరికి బోనస్" పథకాలను మా ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసి, ఇప్పుడు సాగు చేసే రైతులకు నిజమైన భరోసా ఇవ్వాలనే లక్ష్యంలో "రైతు భరోసా", భూమిలేని నిరుపేద రైతు కూలీలకు "ఇందిరమ్మ ఆత్మీయ భరోసా" పథకాలను ప్రారంభించింది.

2018-19 నుంచి రాష్ట్రంలో రైతు బంధు ఇవ్వడం ప్రారంభమైంది. ఆ సంవత్సరం యాసంగిలో రైతు బంధు సాయం 20-10-2018 నుంచి ప్రారంభించి 30-03-2019 నాటికి పూర్తి చేశారు. ఇందుకోసం 5 నెలల 11 రోజులు తీసుకున్నారు. తర్వాతి 2019-20 సీజన్లో యాసంగి సాయాన్ని 28-01-2020న ప్రారంభించి 16-03-2020న పూర్తి చేశారు. తర్వాతి సీజన్లో 2020-21 సీజన్లో 28-12-2020న ప్రారంభించి 22-03-2021న పూర్తి చేశారు. 2022-23 సీజన్లో 21-12-2022న ప్రారంభించి 18-05-2023న పూర్తి చేశారు.

ఇందుకోసం 4 నెలల 28 రోజులు తీసుకున్నారు. ఈ విధంగా దాదాపు ప్రతి యాసంగి సీజన్లో దాదాపు 5 నెలలపాటు రైతు బంధు సాయాన్ని ఒక ప్రహసనంలా సాగించారు. ఒక్క యాసంగి సీజన్ కాదు మొత్తం రైతు బంధు సాయానికి సంబంధించి గత 10 పంటకాలాల గణంకాలను పరిగణనలోకి తీసుకుంటే, ఏ ఒక్క సంవత్సరము కూడా 4 నెలలలోపు చెల్లించింది లేదు. దారుణమైన విషయం ఏమిటంటే నాట్లు పూర్తి అయి రైతు ధాన్యాన్ని అమ్మిన తర్వాత రైతులకు రైతు బంధు పూర్తి చేశారు. గత ప్రభుత్వం యాసంగిలో ఇవ్వాల్సిన రైతు బంధుని ఇవ్వలేదు. మా ప్రభుత్వం వచ్చాక వానాకాలం మొదలు



కాకముందే రూ. 7,625 కోట్లు ఒక్క నెలలోనే చెల్లించాం. గత ప్రభుత్వం రాళ్లు, రాప్పలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు కూడా రైతు బంధు సాయం ఇచ్చి వేల కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసింది. అలా కాకుండా మా ప్రభుత్వం నిజమైన రైతులకు మరింత భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో... గతంలో రూ. 10 వేలు ఇస్తే.. మా ప్రభుత్వం 20 శాతం పెంచి ఏడాదికి ఎకరానికి రూ.12 వేల రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది.

అందుకోసమే సాగు భూముల సర్వే చేయడం జరిగింది. మొన్న జనవరి 26 ఎంపిక చేసిన 561 మండలాల్లోని 577 గ్రామాల్లో 4.41 లక్షల మంది రైతులకు రూ.569 కోట్ల రైతు భరోసా సాయం అందించడం జరిగింది. పథకాన్ని మొదలు పెట్టిన 24 గంటల్లోపే ఎకరాలతో నిమిత్తం లేకుండా రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జయా అయ్యాయి. సాగు భూముల సర్వేను పూర్తి చేసి మార్చి 31లోగా మిగిలిన రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేస్తాం.

గత ప్రభుత్వం రైతు కూలీలను పూర్తిగా విస్మరించింది. కానీ మా ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు భూమి లేని నిరుపేద రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇచ్చే పథకాన్ని అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగా 18,180 మంది వ్యవసాయ కూలీల ఖాతాల్లో రూ. 6 వేల చొప్పున రూ.10 కోట్ల నిధులను జమ చేశాం. మిగతా వారికి మార్చి 31లోపు పూర్తి చేస్తాం.

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు సాయానికి సగటున 4-5 నెలల సాయం తీసుకుంటే మేము మాత్రం మొదటి సారి నెల రోజుల్లో పూర్తి చేశాం. ఇప్పుడు 40 రోజుల్లో పూర్తి చేస్తున్నాం. దీన్నిబట్టి రైతు భరోసా విషయంలో ఎవరి చిత్తశుద్ధి ఎంటో అర్థం చేసుకోవచ్చు. దేశానికి అన్నంపెట్టే రైతు అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో గౌరవం ఉంది. అందుకే మా ప్రభుత్వం రైతు భరోసాతోపాటు, ఆ పథకాలను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించింది. అందులో భాగంగా తొలి బడ్జెట్లోనే రూ. 72 వేల కోట్లను వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయించడం జరిగింది. సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందించే పథకాన్ని పునరుద్ధరించి, రైతులకు సబ్సిడీపై యంత్రాలను అందిస్తున్నాము. గత పదేళ్లలో ఒక్కసారి కూడా మట్టి పరీక్షలు చేపట్టలేదు. మా ప్రభుత్వం దాన్ని పునరుద్ధరించింది.

2014, 2018 రెండు ఎన్నికల్లో రూ. లక్షలోపు రుణ మాఫీ చేస్తానని మాట తప్పిన విషయాన్ని మరిచిపోయి బిఆర్ఎస్ నాయకులు ఒక్కరికి రుణ మాఫీ జరగలేదని అవాస్తవాలను ప్రచారం చేసే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2014-18 వరకు 16,143.94 కోట్లు నాలుగు సంవత్సరాల వ్యవధిలో రుణ మాఫీ జరిగింది. దీనివలన రైతులపై రూ.2630 కోట్లు అధిక వడ్డీ భారం పండింది. 2018-23 వరకు రూ. 11,909.31 కోట్లు నాలుగు సంవత్సరాల వ్యవధిలో జరిగింది. 20,85,832 మంది రైతులకు సంబంధించిన రూ. 8378.97 కోట్లు చేయలేదు. ఏకకాలంలో చేయకపోవడంతో రైతులపై రూ.8515 కోట్లు అధిక వడ్డీ భారం పడింది.

మీ ప్రభుత్వం 2014-23 వరకు నిర్దేశించిన సమయానికి రుణ మాఫీ చేయని కారణంగా రైతుల మీద రూ.11,145 కోట్ల వడ్డీ భారం పడింది. రైతుల మీద రుణ మాఫీ పేరుతో ఇంత భారం మోపిన మీకు రైతు రుణ మాఫీ గురించి మాట్లాడే హక్కు ఉందా అనే విషయాన్ని ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

సాంకేతిక కారణాలతో రుణ మాఫీ కాని 3,13,896 మంది రైతులకు తర్వాత రూ.2747.67 కోట్లు రుణమాఫీ చేయడం జరిగింది. ఇవన్నీ వాస్తవాలు. వీటిని చూడకుండా తమ ప్రభుత్వంలో మాదిరిగానే రుణ మాఫీ జరగలేదనే భ్రమల్లో ఉంటూ, అవే నిజాలుగా నమ్మబెప్ప ప్రయత్నం చేస్తున్నారు. భ్రమల్లో విహరించడం మాని దిగివచ్చి చూస్తే వాస్తవాలు తెలుస్తాయి.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com



డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 30, జనవరి 2025 ||

## ఏటికొప్పాక కళకు మరింత ఊతం

◆ మంత్రి సవిత



**అమరావతి:** 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్యపథ్ లో నిర్వహించిన పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రదర్శించిన ఏటికొప్పాక బొమ్మల శకటం తృతీయ స్థానంలో నిలవడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు.

భారతీయ సంస్కృతీ సంప్రదాయలను చాటిచెప్పేలా రూపొందించిన ఏటికొప్పాక బొమ్మల శకటం దేశ ప్రజలతో పాటు ప్రధాని నరేంద్రమోడిని సైతం ఆకట్టుకుందన్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ హస్తకళాకారుల ప్రతిభ మరోసారి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. సహజ సిద్ధమైన వనరులతో పర్యావరణ హితంగా ఏటికొప్పాక బొమ్మలను తయారు చేస్తుంటారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటికే హస్త కళలకు ప్రాధాన్యమిస్తోందన్నారు.

రాష్ట్రంలో హస్త కళాకారులకు ఆర్థిక చేయూ తనందిస్తూ, పలు ఎగ్జిబిషన్లు నిర్వహిస్తోందన్నారు. చేనేత వస్త్రాలతో కలిపి హస్తకళల ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పిస్తోందన్నారు. ఏటికొప్పాక బొమ్మల శకటం దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొంద డంతో ఆ కళకు మరింత ఊతం లభించే అవకాశ ముందన్నారు. ఏటికొప్పాక బొమ్మల శకటం రూపొదించి, ఢిల్లీ పేరెడ్‌లో ప్రదర్శించిన బృందానికి మంత్రి సవిత ఆ ప్రకటనలో అభినందనలు తెలిపారు.



## టీటీడీ తరహాలో యాదగిరి గుట్ట దేవస్థానం బోర్డు

◆ గుట్ట పవిత్రత కాపాడేలా చర్యలు

◆ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విధివిధానాల రూపకల్పన

◆ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) తరహాలోనే యాదగిరి గుట్ట దేవస్థానం బోర్డు ఏర్పాటు కు వేగంగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ధర్మకర్తల మండలి ఏర్పాటుకు రూపొందించిన ముసాయిదాలో పలు మార్పులను సీఎం సూచించారు.

యాదగిరిగుట్ట బోర్డు నియామకపు నిబంధనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. తిరుమలలో మాదిరే యాదగిరిగుట్ట ఆలయం సమీపంలో రాజకీయాలకు తావులేకుండా చూడాలని, ఆలయ పవిత్రత కు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. ధర్మకర్తల మండలి నియామకంతో పాటు ఆలయం తరపున చేపట్టాల్సిన పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలపై ముసాయిదాలో పేర్కొన్న నిబంధనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు మార్పులు సూచించారు.

సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.27.52 కోట్లతో 'మైలవరం'లో అభివృద్ధి పనులు

◆ ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

**ఇబ్రహీంపట్నం, మహానాడు:** మైలవరం నియోజకవర్గంలో రూ.27.52 కోట్ల ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రహదారులను బుధవారం ఆయన ప్రారంభించారు. రూ.15లక్షల వ్యయంతో



నిర్మించనున్న బీటీ రహదారి అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాదు మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి శ్రమిస్తున్న దార్శనికులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం శ్రీ పవన్ కల్యాణ్‌కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌పై మరో చీటింగ్ కేసు!

**గుంటూరు, మహానాడు:** వైసీపీ హయాంలో బోరుగడ్డ అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. తనను బెదిరించడంతోపాటు డబ్బులు తీసుకొని మోసం చేశాడంటూ గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ లో బోరుగడ్డపై కుంచనపల్లికి చెందిన పాస్టర్ నల్లపు మరియదాసు ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేట ఈ ఎల్ సి చర్చ్ పాస్టర్ గా ఉన్న మరియదాసుని చర్చికి ఫారెన్ ఫండ్స్ ఇప్పిస్తానని పాస్టర్ ని బోరుగడ్డ మభ్యపెట్టాడు. పది లక్షలు ఇస్తే విదేశీ నిధులను మంజూరు చేయిస్తానని నమ్మ పలికాడు. దీనితో ఐదు లక్షల రూపాయలతో బోరుగడ్డ ఇంటికి ఆయన బంధువు రాజేందర్ తో కలిసి మరియదాసు వెళ్ళాడు. ఫారెన్ ఫండ్స్ ఎలా ఇప్పిస్తారు అని అడగడంతో తనను బెదిరించి ఐదు లక్షల రూపాయలు బలవంతంగా తీసుకున్నారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. విదేశీ నిధులు వచ్చాక దానిలో భాగం కూడా ఇవ్వాలని, లేకపోతే ఊరుకోనంటూ భయపెట్టినట్టు చెప్పాడు. అయితే, విదేశీ నిధులు



తెప్పించకుండా కాలయాపన చేశారని పలుమార్లు అడగడంతో తనపై దాడికి దిగారని ఫిర్యాదు చేశారు. మా ప్రభుత్వం అధికారంలో ఉంది చేతనైంది చేసుకో అని బోరుగడ్డ బెదిరించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వం మారాక కూడా పలుమార్లు బోరుగడ్డ వద్దకు వెళ్లి తీసుకున్న ఐదు లక్షలు ఇవ్వాలని ప్రాధేయపడిన పట్టించుకోలేదన్నారు. బోరుగడ్డపై కేసులు నమోదు అవ్వడంతో ధైర్యం తెచ్చుకొని తాను ఫిర్యాదు చేసినట్టు మరియదాసు చెప్పాడు. బోరుగడ్డకు బాధితుడికి మధ్య జరిగిన వాట్సాప్ మెసేజ్ లు , చాటింగ్లను పరిగణలోకి తీసుకొని పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు.



**వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొంది.. ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 50 మందికి రూ.45 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కులను బుధవారం వేల్పనూరులో లబ్ధిదారులకు శ్రీశైలం ఎమ్మెల్యే బి.రాజశేఖర రెడ్డి పంపిణీ చేశారు.**

## దావోస్ నుండి రేవంత్ ఒక చాక్లెట్ కంపెనీ కూడా తేలేదు

◆ రేవంత్ రెడ్డిని చూసి ఎవడు పెట్టుబడులు పెట్టరు

◆ దావోస్ మీటింగ్‌లో చంద్రబాబు, ఫడ్నవిస్ డ్రెస్సింగ్ ఎలా ఉంది? రేవంత్ డ్రెస్సింగ్ ఎలా ఉంది?

◆ కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ ఎద్దేవా



**హైదరాబాద్:** కాంగ్రెస్ బహిష్కృత నేత, నిత్యం తన సంచలన వ్యాఖ్యలతో సోషల్‌మీడియాలో నిలిచే బక్క జడ్సన్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ దావోస్ పర్యటనతో రాష్ట్రానికి ఒక్క చాక్లెట్ కంపెనీ కూడా రాలేదని, రేవంత్‌పై ఉన్న కేసులు చూసి పెట్టుబడులు వెనక్కివెళ్లారని, మేఘా లాంటి దొంగలను తీసుకువెళ్లి ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు.

దళిత నేత బక్క జడ్సన్ ఇంకా ఏమన్నారంటే..రేవంత్ రెడ్డిని చూసి ఎవడు పెట్టుబడులు పెట్టరు. దావోస్‌కి వచ్చిన వాళ్ళు రేవంత్ రెడ్డి బ్యాక్ గ్రౌండ్ చెక్ చేసి, ఆయనపై 8 కేసులు ఉన్నాయి మేము పెట్టుబడులు పెట్టమని వెళ్లి పోతారు. ఆయనపై మేఘా కృష్ణారెడ్డి లాంటి దొంగలను తీసుకునివెళ్లి వాళ్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అంతా జూటా. హైడ్రా వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయింది. దాదాపు లక్ష అపార్ట్‌మెంట్లో ఉన్న ఫ్లాట్లు ఇవ్వాళ అమ్ముడు పోవడం లేదు.

పడిపోయిన రియల్ ఎస్టేట్ హైప్ లేపడానికి రూ. లక్షా 78 వేల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చెప్తున్నారు.రేవంత్ రెడ్డిని చూసి హైదరాబాద్‌లో పెట్టుబడి పెట్టే పరిస్థితి లేదు.రేవంత్ రెడ్డి చైనాతో పోటీ పడతాడంట.. చైనా అధ్యక్షుడు కనీసం రేవంత్ రెడ్డికి అపాయింట్మెంట్ కూడా ఇవ్వడు. దావోస్ మీటింగ్ లో చంద్రబాబు డ్రెస్సింగ్ ఎలా ఉంది? ఫడ్నవిస్ డ్రెస్సింగ్ ఎలా ఉంది? మన ముఖ్యమంత్రి రేవంత్ డ్రెస్సింగ్ ఎలా ఉంది? రేవంత్ రెడ్డి దావోస్‌కు పెట్టుబడులు తేవడానికి పోయినట్టు లేదు.. లైటింగ్ కొట్టడానికి పోయినట్టు డ్రెస్సులు వేసాడు.



## ఫిబ్రవరి 10 లోగా సమగ్ర పర్యాటక విధానం రూపొందించాలి

◆ ఎకో టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించాలి

◆ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యాటకులను ఆకర్షించాలి

◆ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన సమగ్ర పర్యాటక విధానాన్ని ఫిబ్రవరి 10వ తేదీలోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రదేశాలు, అభయారణ్యాలు, ఆలయాల ప్రాతిపదిక చేసుకొని పాలసీని రూపొందించాలని సీఎం సూచించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర పర్యాటక విధానంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తన నివాసంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. దేశీయంగా వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న పర్యాటక పాలసీలతో పాటు అంతర్జాతీయంగా ప్రముఖమైన పాలసీలను అధ్యయనం చేసి తెలంగాణ పర్యాటక పాలసీ రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణకు దేశీయ పర్యాటకులనే కాకుండా అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించాలన్నారు. పర్యాటక రంగంలో బహుళ జాతి కంపెనీలు (ఎంఎన్‌సీ) పెట్టుబడులను ఆకర్షించేలా పాలసీ ఉండాలని సీఎం తెలిపారు. ఎంఎన్‌సీలు పెట్టుబడులు పెట్టినప్పుడు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వసతులు ఏర్పడ తాయని.. అప్పుడు పర్యాటకుల ఆకర్షణ సులవవుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కవ్వాల్, ఆమ్రాబాద్ పులుల అభయారణ్యాలను సఫారీ టూరిజానికి అనువుగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమ్మక్క-సారక్క, రామప్ప దేవాలయం, లక్నవరాలను సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలని, నాగార్జున సాగర్, శ్రీశైలం బ్యాక్ వాటర్‌ల్లో కేరళ తరహాలో బోటు హౌస్‌ల ద్వారా పర్యా టకుల సంఖ్య పెరిగేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో బౌద్ధ పర్యాటక ప్రదేశాలను కలుపుతూ బౌద్ధ సర్క్యూట్ ఏర్పాటు చేయాలన్నారు.

సమ్మక్క-సారక్క జాతరకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులు సమీపంలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సింగపూర్ వంటి దేశాలు తక్కువ ప్రదేశంలో వైవిధ్యమైన ప్రణాళికలతో పెద్ద సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ గార్డెన్, సంజీవయ్య పార్క్, ఇందిరా పార్క్‌లను కలుపుతూ స్కైవాక్, సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు.

అనంతగిరితో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వసతులు మెరుగుపర్చాలని సూచించారు. పరిశ్రమలు, ఇతర రంగాల నుంచి వచ్చే ఆదాయమే కాకుండా పర్యాటక రంగం నుంచి వచ్చే ఆదాయం పెరిగితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరో దశకు చేరుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.


సమీక్షలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్... ప్రచారానికి మేనమామ.. వాస్తవానికి కంసుమామ!

◆ 'ఎక్స్'లో మంత్రి లోకేష్ ఎద్దేవా

**అమరావతి, మహానాడు:** జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికతో జగన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో జరిగిన విధ్వంసం బయటపడింది. ఆయన ప్రచారానికి మేనమామ, వాస్తవానికి కంసమామ అని మరోసారి రుజువైంది. పబ్లిసిటీ కోసం వందల కోట్లు ఖర్చు చేశారే తప్ప విద్యా ప్రమాణాలు పెంచే కనీస చర్యలు తీసుకోలేదని తేటతెల్లం అయ్యింది. 2018లో నాటి టీడీపీ హయాంలో మెరుగ్గా ఉన్న ప్రభుత్వ విద్యా ప్రమాణాలు వైసీపీ పాలనలో ఎలా దిగజారాయో అసర్ నివేదికలో స్పష్టంగా వెల్లడించింది. అడ్డగోలు జీవోలు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల మూసివేత, అక్షరాలు, అంకెలు గుర్తుపట్టలేని స్థితిలో విద్యార్థులు.. తగ్గిన హాజరు శాతం, మంచినీరు, మరుగుదొడ్లు లాంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం.. ఇలా అనేక అంశాలు గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ఎండగడుతున్నాయి. ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో దాదాపు సగం మంది రెండో తరగతి పుస్తకాలు సరిగా చదవలేని పరిస్థితి. విధ్వంసానికి గురైన విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు గత ఏడు నెలలుగా అనేక చర్యలు తీసుకున్నాను. నిరంతరం అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలు తెలుసుకుంటూ అనేక మార్పులకు నాంది పలికాను.

ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు అని పక్కా లెక్కలు తీయడం దగ్గర మొదలుపెట్టి మారుతున్న కాలానికి తగ్గట్టుగా పాఠ్యప్రణాళిక సిద్ధం చేయడం, విలువలతో కూడిన విద్య, విద్యార్థులను క్రీడలతో సహా ఇతర రంగాల్లో ప్రోత్సహించే గైడెన్స్ ఇవ్వడం, కనీస మౌలిక వసతులు కల్పించడం,



Lokesh Nara @naralokesh · 14m

జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికతో జగన్ రెడ్డి గారి పాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో జరిగిన విధ్వంసం బయటపడింది. ఆయన ప్రచారానికి మేనమామ, వాస్తవానికి కంసమామ అని మరోసారి రుజువైంది. పబ్లిసిటీ కోసం వందల కోట్లు ఖర్చు చేశారే తప్ప విద్యా ప్రమాణాలు పెంచే కనీస చర్యలు తీసుకోలేదని తేటతెల్లం

Show more

జగన్ పాలనలో విద్యా వ్యవస్థ పై విధ్వంసం

జగన్ పాలనలో విద్యా ప్రమాణాలు దిగజారాయన్న ASER

| విషయం | 2018లో | 2024లో | తగ్గింది/ పెరిగింది |
|---|---|---|---|
| ప్రభుత్వ బడుల్లో 6-14 ఏళ్ల చిన్నారుల హాజరుశాతం | 63.2 % | 61.8 % | తగ్గింది |
| తాగునీటి సౌకర్యం ఉన్న ప్రభుత్వ స్కూళ్లు | 58.1 % | 55.9 % | తగ్గాయి |
| మరుగుదొడ్డి సౌకర్యం ఉన్న స్కూళ్లు | 86.4 % | 78.4 % | తగ్గాయి |
| బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్డు ఉన్న స్కూళ్లు | 81.1 % | 77.2 % | తగ్గాయి |

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం వరకూ అనేక అంశాలపై దృష్టి పెట్టి పనిచేస్తున్నాం. త్వరలోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చే విధంగా ఆంధ్రప్రదేశ్ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రూపొందించి ప్రజలు, విద్యావేత్తల అభిప్రాయాలు తెలుసుకోబోతున్నామని నారా లోకేష్ బుధవారం పేర్కొన్నారు.



**సత్తెనపల్లి నియోజకవర్గం, రాజుపాలెం మండలం, కోటనెమలిపూరి డొంక కరెంట్ ఆఫీస్ దగ్గర సజీవుని ప్రార్థన మందిరంలో బుధవారం జరిగిన దైవ సేవకుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.**



## కుటుంబ సభ్యులను గుర్తుపట్టని శ్రీతేజ్

◆ ఇంకా ఫిజియోథెరపీ

**హైదరాబాద్:** సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజ్ హెల్త్ బులిటెన్‌ను కిమ్స్ ఆస్పత్రి విడుదల చేసింది. శ్రీతేజ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నట్టు తెలిపింది. అలాగే శ్రీతేజ్ తనంతట తానుగా ఊపిరి పీల్చుకోగలుగుతున్నాడు. ఇప్పటికీ ఇంకా ఫిజియోథెరపీ కొనసాగుతుంది. ఇప్పుడిప్పుడే కోల్కుంటున్నప్పటికీ తన కుటుంబ సభ్యులను గుర్తించటం లేదు అని పేర్కొంది.

## యుఎన్ బిగ్‌డేటా కమిటీలో సభ్యదేశంగా భారత్

యునైటెడ్ నేషన్స్ కమిటీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ ఆన్ బిగ్‌డేటా అండ్ డేటా సైన్స్ ఫర్ అఫీషియల్ స్టాటిస్టిక్స్‌లో భారత్ సభ్య దేశంగా చేరింది. ఈ కమిటీ




అధికారిక గణంకాలను మెరుగుపర్చడం, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ లక్ష్యాలను సాధించడంలో పర్యవేక్షణ, నివేదికలు తయారు చేయడం, బిగ్‌డేటా, డేటా సైన్స్ ఉపయోగంపై దృష్టిసారిస్తుంది.

## ఓలా నుంచి కొత్త స్కూటర్లు

◆ 31న విడుదల

ప్రముఖ ఈవీ వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ కొత్త స్కూటర్లను విడుదల చేయనుంది. మూడో జనరేషన్ ప్లాట్‌ఫామ్‌పై రూపొందిన ఈ




స్కూటర్లను జనవరి 31వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఆవిష్కరించనున్నట్లు కంపెనీ సీఈఓ భవీశ్ అగర్వాల్ తెలిపారు. రెండో తరంతో పోలిస్తే మూడోతరం స్కూటర్లు డిజైన్, ఫీచర్లతో పాటు మెరుగైన పనితీరును కనబరుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తదుపరి తరం స్కూటర్‌కు సంబంధించి గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్

**హైదరాబాద్, మహానాడు:** తెలంగాణ, ఏపీల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్ట భద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ ఖరారు అయింది. ఏపీలో రెండు పట్టభద్రుల, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి మూడోతేదీన వీటికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 27న పోలింగ్, మార్చి మూడోతేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కానుంది.

## అభివృద్ధిని తమదిగా భావిస్తేనే గొప్ప నాయకులు అవుతారు

◆ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

**యడ్లపాడు, మహానాడు:** న్యూఢిల్లీ లో జరిగిన గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ పంచాయతీ సర్పంచ్ గా అవార్డు అందుకున్న యడ్లపాడు మండలం, సందేపూడి గ్రామానికి చెందిన మద్దినీడి శివరామకృష్ణ ని, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం అభినందించి సత్కరించారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ సందేపూడి గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేసి, ఉత్తమ సర్పంచ్‌గా దేశ స్థాయిలో అవార్డు తీసుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. ప్రజల కోసం శ్రమించిన వారిని ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ టీడీపీ కరిముల్లా , తేళ్ల సుబ్బారావు, జవ్వాజి మదన్ మోహన్ , పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 30, జనవరి 2025 ||

# మిర్చి రైతుల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

◆ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

**అమరావతి, మహానాడు:** రాష్ట్రం వ్యాప్తంగా, ప్రధానంగా గుంటూరు జిల్లా మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, దిద్దుబాటు చర్యలకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారని టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. ఈ నెల 12న సీఎంకి మిర్చి రైతుల సమస్యలపై లేఖ రాయటంతో పాటుగా.. మంగళ వారం జరిగిన పార్ల మెంటరీ పార్టీ సమావేశంలో మరోమారు సీఎం దృష్టికి తీసుకెళ్లినప్పుడు ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకుని, మార్కెట్ ధరల స్థిరీకరణకు చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారని, మిర్చి ధరల క్షీణత, ఉత్పత్తి వ్యయాలు, తెగుళ్ల ప్రభావం వంటి అంశాలపై సమగ్ర పరిష్కార చర్యలు త్వరలోనే అమలులోకి రానున్నాయని వెల్లడించారు.





# టీడీపీలోకి వైసీపీ కార్పొరేటర్

◆ పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన పెమ్మసాని

**గుంటూరు, మహానాడు:** నగరంలో వైసీపీకి వరుస షాకులు తగులుతున్నాయి. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై జగన్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు తెలుగుదేశంలోకి క్యూ కడుతున్నారు. 57వ డివిజన్ కు చెందిన మహిళా కార్పొరేటర్ పఠాన్ రిహానా గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి పెమ్మసాని టిడిపిలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నశీర్ అహ్మద్, టీడీపీ నాయకులు భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పెరేడ్ గ్రౌండ్‌ని ప్రారంభించిన డీజీపీ

**నరసరావుపేట, మహానాడు:** నరసరావుపేటలో డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం పర్యటించారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన డాగ్ స్వాడ్, జిల్లా పెరేడ్ గ్రౌండ్ ని డీజీపీ ప్రారంభించారు. ఆయన వెంట గుంటూరు ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి ఉన్నారు. కాగా, డీజీపీని పలువురు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు.

# టీజర్ విడుదల చేసిన ఎమ్మెల్యే

**నరసరావుపేట, మహానాడు:** నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కోటప్పకొండ స్థలాపురాణం యాదార్థ గాథ టీజర్‌ను ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు బుధవారం విడుదల చేశారు. ఈ స్థల పురాణం ఎమ్మెల్యే సారథ్యంలో చిత్రీకరణ జరుగుతుందని దర్శకుడు నరేష్ దోనే మణి వరన్ మీడియాకు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే దర్శకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కుంభమేళాలో తొక్కిసలాట బాధాకరం

◆ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**అమరావతి, మహానాడు:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో సంభవించిన తొక్కిసలాట దుర్ఘటనలో 20 మంది వరకు యాత్రికులు చనిపోయినట్టు వార్తలు వచ్చాయి. ఈ తొక్కిలాట ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ ఘటన చాలా బాధాకరమని, 20 మంది చనిపోవడం ఆవేదనకు గురిచేసిందన్నారు. మౌని అమావాస్య సందర్భంగా త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఇదొక దురదృష్టకర ఘటన అని పవన్ పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు వెళ్లిన వారు అధికారుల సూచనలు పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తొక్కిసలాటలో చనిపోయిన మృతుల కుటుంబాలకు జనసేనాని ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# పేదరిక నిర్మూలనే లక్ష్యం

◆ కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్

**న్యూఢిల్లీ:** కార్మిక సంస్కరణలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో ముందంజలో ఉందని, విజనరీ లీడర్ నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కార్మిక సంస్కరణలు 2015 నుండే అమలు చేశారని, వాటినే ఇప్పుడు కేంద్రం చాలా వరకు అమలు చేస్తుంది అని కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. వేదికపైన అన్ని రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రుల్ని ఉద్దేశించి సుభాష్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము పెట్టుబడుల ఆకర్షణతో పారిశ్రామికీ కరణలో ముందంజలో ఉండడంతో పాటు కార్మికుల సంక్షేమం పట్ల కూడా ఎంతో శ్రద్ధ వహిస్తుందని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.




ఎన్టీఆర్ భరోసా ద్వారా 4000 నుండి 15000 వరకు పెన్షన్లను అందిస్తున్నారని, ఇది దేశంలోనే అత్యధికమని, ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 25 లక్షల వరకు బీమా అందిస్తున్నారని ఇది కూడా దేశంలోనే అత్యధికమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి పేదల ప్రజల పట్ల కార్మికుల పట్ల ఉండే నిబద్ధతకు ఇది నిదర్శనం అని కేంద్రమంత్రి కొనియాడారు. ప్రస్తుతం కేంద్రం అమలు చేయాలనుకుంటున్న చాలావరకు కార్మిక సంస్కరణలు 2015 లోనే చంద్రబాబు నాయుడు అమలు చేయడం ఆయన విజనరీ నాయకత్వానికి నిదర్శనమని కేంద్ర మంత్రి కొనియాడారు అని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమ ప్రోత్సాహకాల విషయంలోను, ఉద్యోగ అవకాశాల విషయంలోను ప్రణాళిక బద్ధంగా సాగుతున్నాం. పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కూటమిగా పని చేస్తున్నామని మంత్రి తెలిపారు.

# తప్పుడు కేసుతో చంద్రబాబును ఇరికించిన జగన్ సర్కారు!

◆ ఫిర్యాదు ఇచ్చింది ఒకరు.. ఎఫ్ఐఆర్ లో ఇంకొకరి పేరు


◆ సాక్షి పత్రికపై పరువు నష్టం కేసు వేసే అంశం సీఐడీ పరిశీలించాలి

◆ మధుసూధన్ రెడ్డి, గౌతమ్ రెడ్డి లపై కేసు పెట్టే అంశం పరిశీలన

◆ సొంత వాళ్లకు రూ. 100 కోట్లకు పైగా అక్రమంగా పనులు ఇచ్చిన వైసీపీ

◆ సినీ దర్శకుడు వర్మ.. నా దగ్గర డబ్బులు లేవని చెబుతున్నారు

◆ ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ జీవీ రెడ్డి



**విజయవాడ, మహానాడు:** వైసీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై అక్రమంగా కేసు పెట్టి ఇరికించారని అందుకే కోర్టు ఆ కేసును కొట్టివేసిందని ఏపీ ఫైబర్ నెట్ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో గల ఫైబర్ నెట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జీవీ రెడ్డి మాట్లాడారు. 2014 లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో టెరాసాఫ్ట్ సంస్థపై ఒత్తిడి తెచ్చారనే అభియోగాలపై గత ప్రభుత్వం కేసు పెట్టిందన్నారు.

టెరా సాఫ్ట్ ఎండీ వేమూరి వేమూరి హరిప్రసాద్ పై తప్పుడు కేసులు పెట్టి వేధించారన్నారు. కులాల ప్రాతిపదికన ముఖ్యమంత్రి చంద్రబాబు ను ఇరికించేందుకు జగన్ మోహన్ రెడ్డి తప్పుడు ఫిర్యాదులు చేసి అక్రమంగా కేసు పెట్టించారని తెలిపారు. గతంలో మాజీ ఫైబర్ నెట్ ఛైర్మన్ గౌతమ్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు పై ఫిర్యాదు చేస్తే ఎండి ఫిర్యాదు ఇచ్చినట్టు ఎఫ్ఐఆర్ కాలమ్ 6 లో రాశారని, ఫిర్యాదులో ఎక్కడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేరు లేకపోయినా కక్షపూరితంగా వ్యవహరించార న్నారు. విచారణ మొదలు పెట్టాక చంద్రబాబు ను ఇరికించాలని ఆయన పేరు పెట్టారన్నారు. ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబుపై పెట్టిన కేసులో విచారణ అధికారులు వేసిన చార్జి షాట్ ను కోర్టు రిజెక్ట్ చేసిందన్నారు.. చార్జిషీట్ ను కోర్టు రిజెక్టు చేస్తే జగన్ సొంత పత్రికలో తప్పుడు వార్తలు రాశారని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో తప్పుగా ఇచ్చిన ఆడిట్ నివేదికను కోర్టు కొట్టివేసిందన్న విషయం గుర్తుంచుకోవాల న్నారు.

తప్పులు చేసింది మీరని, మేము ఆడిట్ నివేదికను తొక్కిపెట్టినట్టు వార్త రాశారని అది అవాస్తమని ప్రశ్నించారు. మేమేదో ఆడిట్ నివే దికను తొక్కిపెట్టామంటూ సాక్షి దినపత్రికలో తప్పుడు కథనాలు రాస్తున్నారన్నారు.. రాష్ట్ర ఫైబర్ నెట్ కు సంబంధించి గతంలో టీడీపీ వేసిన పునాదుల వల్లే గత 5 ఏళ్లలో వాళ్లు ఫైబర్ నెట్ సంస్థలో ఎన్ని అరాచకాలు చేసినా ఆ సంస్థ తట్టుకుని నిలబడగలిగిందన్నారు.

తమకు కావాల్సిన వారికి ఇష్టమొచ్చినట్టు చెల్లింపులు చేసుకున్నారని జీవీ రెడ్డి ఆరోపించారు. అందులో ముఖ్యంగా గతంలో పనిచేసిన ఎండీ మధుసూధన్ రెడ్డి తన సొంత బ్రదర్స్ కి 100 కోట్ల కాంట్రాక్ట్స్ ఇచ్చి, అధికార దుర్వినియోగం చేశారన్నారు. అధికారులతో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించాలంటూ ఆ పేపర్‌లో తప్పుడు వార్తలు రాశారన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులందరికీ కూటమి ప్రభుత్వం పోస్టింగులు ఇచ్చిందన్నారు. పోస్టింగులు ఇస్తే అధికారులు అనుకూలంగా పనిచేస్తారా అని ప్రశ్నించారు.

అంతేకాకుండా అలా అయితే గతంలో మీరు పోస్టింగ్ లు ఇచ్చి అధికారులతో అనుకూలంగా పనులు చేయించుకున్నారని అనుకోవాలా అని అన్నారు. అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతినే విధంగా, వారి ప్రతిష్ఠ దిగజార్చేలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సీఆర్డీయే పూర్వ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ను బెదిరించి లొంగదీసుకున్నామని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, వైసీపీ హయాంలో అధికారులు చేసిన ఆడిట్ నివేదిక తప్పుడుదని కోర్టు కొట్టేసిందని తెలిపారు. మేము తప్పులు చేశామని ఆరోపణలు చేయడం దారుణం అన్నారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టినందుకు ఏపీ ఎస్ఎఫ్ఎల్ పూర్వ ఎండీ మధుసూధన్ రెడ్డి, గత ఛైర్మన్ గౌతమ్ రెడ్డిపై కేసు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఆయన చెప్పారు.

సీఐడీపై వచ్చిన ఆరోపణలపై ఆ విభాగం అధికారులు స్పందించి వివరణ ఇచ్చి స్పష్టత ఇవ్వాల్సి ఉందన్నారు. లేకపోతే ఆ సంస్థపై అనుమానాలు వచ్చే అవకాశం ఉందన్నారు.. సాక్షి పేపర్ పై పరువు నష్టం కేసు వేసే అంశాన్ని సీఐడీ అధికారులు పరిశీలించాల్సి ఉందన్నారు. ఫైబర్ నెట్‌లో వ్యూహం సినిమా ప్రదర్శనకు సంబంధించి అక్రమాలపై దర్శకుడు వర్మకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఆ నోటీసులు వర్మ అందుకున్నారని, ఫైబర్ నెట్ కేసులో చెల్లించాల్సిన డబ్బు తన వద్ద లేదని వర్మ చెబుతున్నారన్నారు.

# కరెంటు బిల్లు ఎక్కువ వస్తుందని పింఛన్ రద్దు చేసిన వైసీపీ సర్కారు!

◆ టీడీపీ గ్రీవెన్స్‌లో బోరుమన్న దివ్యాంగుడు

◆ గత ప్రభుత్వంలో జరిగిన భూ కబ్జాలపై బాధితులు ఫిర్యాదు

◆ 22ఏ నుండి తమ భూములు తొలగించాలంటూ వినతి

◆ అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్సీ అశోక్ బాబు, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి

**మంగళగిరి, మహానాడు:** టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్సీ అశోక్ బాబు, సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డిలు అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. వైసీపీ పాలనలో ఉద్దేశపూర్వకంగా తమ భూముల్ని 22ఏ జాబితాలో చేర్చడం, అధికారం అడ్డంపెట్టుకుని నాడు భూములను కబ్జా చేయడంపై బాధితులు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి వారి గోడు వెళ్లబోసుకుని, తమ సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని వేడుకున్నారు.

సత్యసాయి జిల్లా అమడగూరు మండలం జౌకుల కొత్తపల్లి గ్రామానికి చెందిన కె. రెడ్డప్ప విజ్ఞప్తి చేస్తూ.. తాము కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని 22ఏలో పడేశారని.. దయ చేసి తమ భూమిని 22ఏ నుండి తొలగించాలని వారు వేడుకున్నారు.

ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన గోపి కృష్ణ విజ్ఞప్తి చేస్తూ.. నూజివీడు గ్రామంలో తమ తండ్రి కొనుగోలు చేసిన భూమిని జగనన్న ఇళ్లకోసమని తీసుకొని 22ఏ లో పెట్టారని.. దాన్ని తొలగించి తమ భూమిని తమకు అప్పగించాలని నేతలకు విజ్ఞప్తి చేశారు. ఉరుటి బానూజిరావు, కూనిశెట్టి భాస్కర్ రావు, కూని శెట్టి మోహన్ రావు, కనకల వెంకటరావులు ప్రభుత్వ పోరంబోకు వాగును ఆక్రమించారని దీనిపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, విజయనగరం జిల్లా రామభద్రపు మండలం ఆరికతోట గ్రామానికి చెందిన పి. రాధాకృష్ణ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి చర్యలు తీసుకోవాలని కోరారు.

కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన తుమ్మల వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ.. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకొని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని.. దీనిపై విచారించి తప్పుడు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరాడు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలానికి చెందిన టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుదర్శన నాయుడు నేతలకు విజ్ఞప్తి చేస్తూ.. గండికోట నుండి పుట్లూరు వయా సుబ్బరాయ సాగర్ ఎత్తిపోతల పథకం ఆర్థిక శాఖ క్లియరెన్స్ లో ఉన్నదని.. ఈ పథకం పూర్తి అయితే దాదాపు 35 వేల ఎకరాలకు సాగునీరు రెండు మండలాల్లోని గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుందని త్వరగా నిధులు మంజూరు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.





ప్రకాశం జిల్లా దోర్నాల మండలానికి చెందిన యేదల శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేస్తూ.. తాను గుంటూరు లోని మలబార్ సీడ్స్ ప్రయివేట్ లిమిటెడ్ వారి వద్ద నగదు చెల్లించి కొనుగోలు చేసిన విత్తనాలు నకిలివి అని తెలిసి తిరిగి విత్తనాలను వారికి పంపగా చెల్లించిన నగదుకు రెండు చెక్కులు ఇచ్చి డబ్బులు తీసుకొమని చెప్పారని.. బ్యాంకులో వేస్తే చెక్కులు బౌన్స్ అయ్యాయని.. మలబార్ సీడ్స్ వారిని వెళ్లి డబ్బులు అడిగితే ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని.. వారిపై చర్యలు తీసుకొని తమకు డబ్బులు ఇప్పించాలని గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి వేడుకున్నాడు.

ప్రకాశం జిల్లా దోర్నాల మండలం చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన దొడ్డా శేషాద్రి గ్రీవెన్స్ లో నేతలకు విజ్ఞప్తి చేస్తూ.. తమ ఊరి చెరువుకు వర్షపు నీరు వచ్చే నల్ల వాగు కలువ కంటే వెలుగొండ కాలువ బ్రిడ్జిని ఎత్తులో కట్టడం వలన చెరువులోకి రావాల్సిన నీరు వృథాగా పోతుందని.. దాంతో చెరువులోకి నీరు రాక గ్రామ రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. దయ చేసి చెరువులోకి నీరు వచ్చేలా అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలానికి చెందిన కొండామర్రెపల్లి గ్రామానికి చెంది రామచంద్ర విజ్ఞప్తి చేస్తూ.. తమకు ప్రభుత్వం మంజూరు చేసిన భూమిని మరోకరు కబ్జా చేశారని. తమకు మంజూరు చేసిన భూమిని కబ్జా నుండి విడిపించాలని వేడుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన వేముల శ్రీను విజ్ఞప్తి చేస్తూ.. తాను దివ్యాంగుడినని తనకు వస్తున్న పింఛన్ ను గత ప్రభుత్వంలో కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తుందని తొలగించి తనకు అన్యాయం చేశారని.. తొలగించిన పింఛన్ పునరుద్ధరించి ఆదుకోవాలని నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.

# గాంధీయిజంతోనే సమస్యలు పరిష్కారం

◆ డొక్కా మాణిక్య వరప్రసాద్

**గుంటూరు, మహానాడు:** దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గాంధీయిజమే శరణ్యమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం గాంధీజీ ఆశించిన సమాజం – నేటి పరిస్థితులు అనే అంశంపై జన చైతన్య వేదిక హాలులో జరిగిన చర్చా గోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ గాంధీజీ అవసరం గతం కన్నా నేడు ఎక్కువగా ఉందని, హింస, కుల, మత, ప్రాంతీయ తత్వాలు, అవినీతి, వినియోగతత్వం లాంటి సమస్యల పరిష్కారానికి గాంధీయిజం పరిష్కారాలు చూపిస్తుందన్నారు.

జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ గాంధీజీ దక్షిణాఫ్రికాలోనే సత్యాగ్రహం ఆయుధాన్ని ఉపయోగించారని, స్వరాజ్ సాధన లక్ష్యంతో స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయులను భాగస్వామ్యం చేశారని తెలిపారు. నేడు దేశంలో ఎగుమతులు కన్నా దిగుమతులు 122 బిలియన్ డాలర్లు లోటుగా ఉందని, 1948లో ఒక డాలర్ విలువ 3.30 రూపాయలు పైసలు ఉంటే నేడు 86.57 రూపాయలకు చేరిందన్నారు.

ప్రపంచ అసమానతల ల్యాబ్ నివేదికల ప్రకారం భారత్ లో పై ఉన్న ఒక శాతం ధనవంతుల చేతుల్లో 40 శాతం సంపద, 22 శాతం జాతీయ ఆదాయం కేంద్రీకృతమై ఉందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంబేద్కర్ పీఠం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్. శామ్యూల్ ప్రసంగిస్తూ దేశంలో భౌతికంగా అంటరానితనం తగ్గినప్పటికీ, మానసిక అంటరానితనం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్చా గోష్ఠిలో నేస్తం సహ వ్యవస్థాపకుడు టి. ధనుంజయ రెడ్డి, కోవిడ్ ఫైటర్స్ ముజీబ్ భాషా, మానవత సభ్యుడు అలా అనంతరామయ్య, తదితరులు ప్రసంగించారు.



# సోషల్ మీడియా ప్రతినిధులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు!

◆ చాగంటికి అవమానం జరగలేదు: టీటీడీ

**తిరుమల, మహానాడు:** ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మర్షి డాక్టర్ చాగంటి కోటేశ్వర రావు తిరుమల యాత్రలో భాగంగా టీటీడీలో అవమానం అంటూ దుష్ప్రచారం చేసిన సోషల్ మీడియా ప్రతినిధులపై తిరుపతి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో మంగళవారం టిటిడి ఫిర్యాదు చేసింది. దీంతో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న డయల్ న్యూస్, పోస్ట్ 360, జర్నలిస్ట్ వైఎన్ఆర్, నిర్వాహకులపై తిరుపతి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. చాగంటి తిరుమల పర్యటనపై వాస్తవ సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా టీటీడీ వెల్లడించినా, ఆ సోషల్ మీడియా ప్రతినిధులు డయల్ న్యూస్, హైదరాబాద్, పోస్ట్ 360, హైదరాబాద్, జర్నలిస్ట్ వైఎన్ఆర్, హైదరాబాద్, వారు పదే పదే టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతినేలా వాస్తవాలను వక్రీకరించి దురుద్దేశంతో అవాస్తవాలను ప్రచారం చేశారు.

దీంతో వారిపై తిరుపతి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడంతో పాటు న్యూఢిల్లీలో, విజయవాడలో గల పీఐబీ (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) వారికి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న చాగంటి కోటేశ్వర రావు ఆధ్యాత్మిక అభిమానుల మనోస్థైర్యాన్ని పలుచన చేసేలా విష ప్రచారం చేసిన ఆ సోషల్ మీడియా సంస్థల లైసెన్స్ లను రద్దు చేయాలని యూట్యూబ్ మేటా మేనేజ్మెంట్ కి కూడా ఫిర్యాదు చేశారు.



వాస్తవానికి చాగంటి కోటేశ్వర రావు కి ఈ నెల 14న శ్రీవారి దర్శనం, 16వ తేదీ సాయంత్రం టీటీడీకి చెందిన మహతి ఆడిటోరియంలో ప్రవచనాలు ఇచ్చేందుకు 2024, డిసెంబర్ 20న టీటీడీ ప్రొసిడింగ్స్ ఇచ్చింది. వారికి ఉన్న కేబినేట్ ర్యాంక్ ప్రోటోకాల్ ప్రివిలేజ్ ప్రకారం ఈ నెల 14న శ్రీవారి దర్శనం ఏర్పాట్లను చేసింది. అందులో భాగంగా, రాంబగీచ గెస్ట్ హౌస్ నుంచి శ్రీవారి ఆలయానికి వారిని తీసుకెల్లేందుకు బ్యాటరీ వాహనాలను, శ్రీవారి ఆలయానికి బయోమెట్రిక్ ద్వారా అనుమతించేందుకు టీటీడీ ఏర్పాట్లను చేసింది.

టీటీడీ చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లను వారు సున్నితంగా తిరస్కరించి, సామాన్య భక్తుల తరహాలోనే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి శ్రీవారి ఆలయానికి చేరుకురుకుంటానని వారే స్వయంగా వెల్లడించి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ నెల ఎనిమిదోతేదీన తిరుపతిలో జరిగిన తోపులాట ఘటన నేపథ్యంలో శ్రీ చాగంటి వారి ప్రవచన కార్యక్రమాన్ని వాయిదా వేస్తే బాగుంటుందని వారి దృష్టికి టీటీడీ ఉన్నతాధికారులు తీసుకెళ్లగా, ఈ విన్నపాన్ని చాగంటి అంగీకరించారు. తదుపరి వారి అనుమతి తేదీలను మరోసారి తీసుకుని ప్రవచనాలు ఇచ్చేందుకు టీటీడీ నిర్ణయించింది. వాస్తవం ఇలా ఉండగా బయోమెట్రిక్ ద్వారా కాకుండా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి శ్రీవారి ఆలయంలోకి అనుమతించారని, చివరి నిమిషంలో పరిపాలనా కారణాల రీత్యా చాగంటి వారి ప్రవచనాల కార్యక్రమాన్ని టిటిడి రద్దు చేసినట్లు అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేశారని టీటీడీ ఆరోపించింది.

శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమే కాకుండా , ప్రపంచ వ్యాప్తంగా ప్రతిష్ఠ ఉన్న టీటీడీ సంస్థను పలుచన చేస్తూ ఉద్దేశ్యపూర్వకంగా అవాస్తవాలను పదే పదే దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులపైనా, సంస్థలపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరించింది.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

08

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 30, జనవరి 2025 ||

## ప్రజలు తిరస్కరించినా జగన్ బుద్ధి మారడం లేదు

◆ జీవీ ఆంజనేయులు విమర్శ

**వినుకొండ, మహానాడు:** అరాచకాలు, దుర్మార్గాలు, అవినీతి, దోపిడీ పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించినా జగన్ బుద్ధి మారడం లేదని ప్రభుత్వ చీఫ్ విప్, వినికొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. 2014-19 మధ్య చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి, ఆదాయం, ఉద్యోగాల కల్పనలో నెంబర్-1 నిలిపితే, జగన్ ఐదేళ్లలో పదిన్నర లక్షల కోట్లు అప్పులు, అవినీతితో అధోగతి పాల్జేశారని మండిపడ్డారు. ఈ మేరకు వినుకొండలో బుధవారం మీడియా సమావేశంలో జీవీ మాట్లాడారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా ప్రకటించిన ప్రతిపథకం అమలు చేస్తామన్నారు. సీఎంగా చంద్రబాబు ఉన్నారుకాబట్టి జగన్ చేసిన ఆర్థిక విధ్వంసాన్ని తట్టుకుని తిరిగి సంక్షేమం, అభివృ ద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. జగన్‌కు నిజంగా సిగ్గూశరం ఉంటే.. డిగ్రీ



విద్యార్థులకు రూ. 2,832 కోట్లు, చిక్కీలు, కోడిగుడ్లకు రూ.256 కోట్లు, వసతి దీవెనకు రూ.989 కోట్లు, ఆరోగ్య శ్రీకి రూ.1800 కోట్లు, ధాన్యానికి రూ.1600 కోట్లు, ఉద్యోగులకు రూ.20వేల కోట్లు, సాగునీటి కాంట్రాక్టర్లకు రూ. 19వేల కోట్లు, గృహనిర్మాణానికి రూ. 7,800 కోట్లు, ఉపాధి హామీకి రూ.2,100 కోట్లు ఎందుకు బకాయి పెట్టారని నిలదీశారు.

## రోజాపై మళ్లీ ఐరెన్‌లెగ్ ట్రోల్!

◆ కుంభమేళాకు వెళ్లిన రోజా

◆ తొక్కిసలాటలో 30 మంది మృతి

◆ రోజా లెగ్ మహత్యమేనంటూ సోషల్‌మీడియాలో ట్రోలింగ్

(మూర్తి సుబ్రహ్మణ్యం)

మాజీమంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా సుదీర్ఘకాల విరామానంతరం మళ్లీ 'ఐరెన్‌లెగ్'గా ట్రోల్ అవుతున్నారు. గతంలో ఆమె టీడీపీలో ఉన్నప్పుడు, ఐరన్‌లెగ్ అన్న ట్రోలింగ్‌కు గురైన విషయం తెలిసిందే. తర్వాత వైసీపీలో చేరి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత, ఆ ట్రోలింగ్‌కు తెరపడింది.

మళ్లీ ఇప్పుడు మహా కుంభమేళా నేపథ్యంలో, ఆమెపై ఐరెన్‌లెగ్ ట్రోల్ మొదలయింది.

ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. ప్రతిరోజూ కోటిమందికి పైగా భక్తులు కుంభమేళాకు వెళ్లి, పుణ్యస్నానాలు చేస్తున్న విషయం తెలిసిందే. దేవుడిని బాగా నమ్మే మాజీ మంత్రి రోజా కూడా ప్రయాగరాజ్‌కు వెళ్లి పుణ్యస్నానం చేశారు. అందులో తప్పేమీలేదు. కానీ రోజా కుంభమేళాకు వెళ్లిన వేళావిశేషం ఫలితంగానే, అక్కడ తొక్కిసలాట జరిగి 30 మంది చనిపోయారంటూ.. సోషల్‌మీడియాలో తెగ ట్రోలింగ్ మొదలయింది. రోజా అక్కడకు వెళ్లకపోతే 30 మంది భక్తులు హాయిగా స్నానాలు చేసి ఇళ్లకు చేరేవారని, రోజా అక్కడకు వెళ్లడం వల్ల ఆమె పాదమహత్యం ఫలితంగా, అంతమంది ఒకేసారి వైకుంఠయాత్రకు వెళ్లారంటూ నెటిజన్లు శరపరంపరగా ట్రోల్ చేస్తున్నారు.



ఐరెన్‌లెగ్ మహత్యం మళ్లీ మొదలయింది.. అమ్మా రోజా దయచేసి మీరు దేశప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి సాహసాలు చేయకండి.. మీ పర్యటన కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యం.. కావాలంటే మీకు నిలువెత్తు విగ్రహాలు కొని పంపిస్తాం. ఇంట్లోనే పూజలు చేసుకోండి.

అంతేగానీ ఇలాంటి కార్యక్రమాలకు హాజరుకావద్దు. మీ కాళ్లు మొక్కుతాం.. మీకు అంతగా వెళ్లాలను కుంటే మీ జగనన్న మాదిరిగా ఇంట్లోనో, లేకపోతే తాడేపల్లి ప్యాలెస్‌లోనో ఎంచక్కా సెట్టింగ్‌వేసుకుని అక్కడికి వెళ్లినట్లు ఫీల వండి.. అంటూ తెగ కామెంట్లు పెడుతున్నారు. పాపం రోజా!

## జగన్ పాలనలో చదవడం మర్చిపోయిన విద్యార్థులు!

◆ అసర్ నివేదికే సాక్ష్యం

◆ సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి విమర్శ

**మంగళగిరి, మహానాడు:** వైసీపీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా దెబ్బతీసిందని, అందుకు కేంద్రం విడుదల చేసిన అసర్ నివేదికే సాక్ష్యమని సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంది. ఇటీవల విడుదలైన అసర్ నివేదికను పరిశీలిస్తే.. దేశం మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే మూడో తరగతి చిన్నారుల్లో రెండో తరగతి పాఠ్యపుస్తకాలనైనా తడబడకుండా చదివే సామర్థ్యం 2022లో 16.3% ఉండగా, 2024 నాటికి 23.4%కి చేరింది. అందుకు భిన్నంగా రాష్ట్రంలో మూడో తరగతిలో ఉండి రెండో తరగతి పుస్తకాలు చదవడం వచ్చిన విద్యార్థులు 2018లో 22.6 శాతం ఉంటే 2024లో 14.7 శాతానికి తగ్గారు. ఇది జగన్ రెడ్డి పాలన డొల్లతనం.

కేంద్రం విడుదల చేసిన అసర్ నివేదిక ఈ విషయాలను చెప్పింది. ఐదో తరగతి చదువుతూ రెండో తరగతి పుస్తకాలు చదవడం వచ్చిన వాళ్లు 2018లో 57.1 శాతం ఉండగా, 2024లో 37.5 శాతానికి తగ్గారని అసర్ నివేదిక వెల్లడించింది. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తానని హామీనిచ్చి వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది.

అయిదేళ్ళలో ఒక్క ఉపాధ్యాయ నియామకం కూడా జరపలేదు.



ఉపాధ్యాయులు తనకు సహకరించడం లేదని, సీపీఎస్ రద్దు చేయాలని పదే పదే అడగడంతో వారిపై ఉన్న అక్రోశాన్ని వెళ్లగక్కేందుకు జీఓ-117ను జగన్మోహన్ రెడ్డి అస్త్రంగా వాడాడు. రాష్ట్ర వ్యాప్తంగా 4,234 ప్రాథమిక పాఠశాలలను ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేసి టీచర్లను, విద్యార్థులను ఇబ్బంది పెట్టారు. రాష్ట్రంలో ఎంతో చరిత్ర కలిగిన ఎయిడెడ్ విద్యా వ్యవస్థను వైసీపీ నాశనం చేసింది. జగన్ రెడ్డి ఒక్క నెలకూడా సకాలంలో టీచర్లకు జీతాలు ఇవ్వలేదు. అధికారంలోకి రాగానే ఇంగ్లీష్ మీడియం అన్నాడు, తరువాత సీబీఎస్ఈ, తరువాత బైజూస్, టోఫెల్, ఐబీ ..... ఇలా విద్యార్థులతో, ఉపాధ్యాయులతో ఆడుకున్నాడు.

రాష్ట్రంలో ఏకోపాధ్యాయ స్కూల్స్ లేకుండా చేస్తామని, ప్రతి బడికీ ఇద్దరు ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పి మోసం చేశారు. నాడు నేడు పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించి ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చాడు. కోడిగుడ్లను గుత్తేదారు సకాలంలో బడికి సరఫరా చేయని చోట విద్యార్థులకు గుడ్డుపెట్టలేదని ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చాడు. నాడు నేడు పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించి ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చాడు. మద్యం షాపుల వద్ద ఉపాధ్యాయులను కాపలా పెట్టి వారిని అవమానపరిచారు. చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం 90 మంది ఎస్టీ యువతను కొత్తగా ఉపాధ్యాయులుగా నియామకం చేసింది. జూనియర్ కాలేజీల్లో 700 మంది సిబ్బంది సేవలు పునరుద్ధరించింది.

476 ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో 3619 మంది కాంట్రాక్టు లెక్చరర్ల సేవలను పునరుద్ధరించింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 488 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసింది. ఇంటర్ కాలేజీ విద్యార్థులకు కూడా ఉచిత పుస్తకాలు, బ్యాగులు పథకం పునరుద్ధరించింది. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం పునరుద్ధరించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐఐటీ, నీట్ కి శిక్షణ ప్రారంభించింది."సాల్ట్" ద్వారా టీచర్స్‌కి శిక్షణ ఇచ్చి విద్యా వ్యవస్థను మెరుగుపరచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ లు విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టారని దీపక్ రెడ్డి అన్నారు. లోకేష్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో మార్పు కనబడుతోంది. రాబోయే కాలంలో నేషనల్ లెవల్‌లో ఒక బెస్ట్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందని దీపక్ రెడ్డి వివరించారు.

## ప్రజలు ఒక అరాచక శక్తిని తరిమికొట్టారు!

◆ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

**మంగళగిరి, మహానాడు:** వైసీపీ సర్కారు హయాంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పునిచ్చారు. ఒక అరాచక శక్తిని తరిమికొట్టారు. వైసీపీ అరాచకాలు తట్టుకోలేకే ఎన్డీయే ప్రభుత్వానికి అవకాశమిచ్చారు. రూ. 4లక్షల 40 కోట్లకు పైగా అప్పులు చేశారు. ఈ ఏడు నెలల్లో అయిదేళ్ళ అభివృద్ధిని మేం చేసి చూపించాం. చంద్రబాబు గతంలో ప్రకటించిన సూపర్ 6 లో ఒక్కొక్కటిగా చేసుకుంటూ వస్తున్నాం.

వైసీపీ నాయకులు వెయ్యి రూపాయలు పింఛన్ పెంచుతామన్నారు. తరువాత విడతలవారీ అన్నారు. ప్రజల్ని మోసం చేసి



అధికారంలోకి వచ్చారు. వైసీపీ ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచడానికి ఆపసోపాలు పడింది. వైసీపీ ప్రభుత్వం అప్పులు, బకాయిలు మిగిల్చింది. అప్పులు, బకాయిలు ఉన్నప్పటికి రూ. 4 వేలు పింఛన్ పెంచి ఇస్తున్నాం. ఏప్రిల్ నుంచే అరియర్స్ ఇస్తామన్నాం. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నామని మంత్రి బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

గౌడ కులస్తులకు మద్యం షాపుల్లో 10 శాతం రాయితీతో షాపులిస్తున్నాం. గీత కార్మికులను ఆదుకుంటున్నాం. గంజాయి రహిత రాష్ట్రం చేస్తున్నాం. లా అండ్ ఆర్డర్ ను కూడా పూర్తిగా కంట్రోల్ లో పెట్టాం. 2047 నాటికి ప్రతి ఒక కుటుంబంలో సాధికారత సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. రాయలసీమలోని చిత్తూరు జిల్లాతోపాటు ప్రకాశం జిల్లాల్లో దారుణంగా వైసీపీ నాయకులు భూ ఆక్రమణలు చేశారు. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా వీటిని ఎలిగెత్తి చూపించాం. అవన్నీ అక్షర సత్యాలని ఇప్పుడు అర్థమౌతోంది. ఇంకా బయటికి రావాల్సిన పాపాలు అనేకం ఉన్నాయి. ఒక్కొక్కటిగా బయటికి వస్తాయని మంత్రి వీరాంజనేయస్వామి హెచ్చరించారు.

## 'ఉక్కు'ను లాభాల బాట పట్టించాలి

◆ నేడు స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర గనుల శాఖ మంత్రి కుమార స్వామి

◆ ఆ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడి

**ఢిల్లీ:** విశాఖ స్టీల్ ప్లాంట్ ను కేంద్ర గనుల శాఖ మంత్రి కుమారస్వామి గురువారం సందర్శించ నున్నట్లు ఆ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ బుధవారం మీడియాకు తెలిపారు. ఈ పర్యటనలో తాను ఉన్నట్టు చెప్పారు. ఉద్దీపన ప్యాకేజ్ ప్రకటించిన తర్వాత మొదటిసారి అక్క డికి వెళ్లి కార్మిక, ఉద్యోగ సంఘాలతో చర్చించ బోతున్నామని, కష్టమైన పరిస్థితుల్లోనూ ప్రభుత్వ పెద్దలను ఒప్పించి, నచ్చజెప్పి ప్యాకేజ్ తీసుకొచ్చామన్నారు. ప్యాకేజ్ ద్వారా ప్లాంట్ పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని, ప్లాంట్ యాజమాన్యం, కార్మికులు ఈ విషయంపై దృష్టి పెట్టాలని కోరుతున్నట్టు తెలిపారు. ఇంకా, వర్మ ఏమన్నారంటే..

ఉద్యమించి ప్లాంట్ సాధించుకున్నట్టే... సమష్టిగా పనిచేసి సంస్థను లాభాల్లోకి తీసు కెళ్లాలి. 2030 నాటికి దేశంలో స్టీల్ ఉత్పత్తిని 300 మిలియన్ టన్నులకు పెంచాలన్నది ప్రధాని ఆలోచన. నిన్న, మొన్న బొకారో స్టీల్ ప్లాంట్ సందర్శించి, అక్కడ స్టీల్ ఉత్పత్తి పెంచాలని సూచించాం. స్టీల్ ప్లాంట్ కార్మికులమూడు నెలల వేతన బకాయిలు చెల్లించే అంశంపై రేపు చర్చిస్తాం. కార్మికుల్లో అపోహలు వద్దు. భవిష్యత్తులో ప్రైవేటీకరణ చేస్తారన్న ఆందోళన చెందకండి. స్టీల్ ప్లాంట్ ను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఆ మేరకు సంస్థను లాభాల్లోకి తీసుకెళ్లే దిశగా అందరూ కష్టపడాలి.

ప్యాకేజ్ డిమాండ్ చేసిన కొన్ని సంస్థలు, వ్యక్తులు ప్యాకేజ్ ఇచ్చిన తర్వాత వారు చేస్తున్న ప్రకటనలు పూర్తి బాధ్యతారాహిత్యంగా ఉన్నాయి. సంస్థకు రూ 35 వేల కోట్లు బకాయిలు, రుణాలు ఉన్నాయి. సంస్థ నష్టాల్లో ఉన్నప్పుడు మొత్తం సొమ్ము కేంద్రం భరిస్తేనే



బయటపడుతుంది అని చెప్పడం సరికాదు. కేంద్రం తన వంతుగా రూ. 11,440 కోట్ల ప్యాకేజ్ ఇచ్చింది. ఇప్పుడు సంస్థలో 3 బ్లాస్ట్ ఫర్నేస్ లను పనిచేయించేలా చేసి, ఉత్పత్తి సామర్థ్యాన్ని గరిష్ఠానికి తీసుకెళ్లి సంస్థను లాభాల బాట పట్టించాల్సిన అవసరం. ఈ బాధ్యత యాజమాన్యం, కార్మికులపై ఉంది.

## జయహో భారత్

మొదటి పేజీ తరువాయి..

ఈ సందర్భంగా శాస్త్రవేత్తలను సిబ్బందిని అభినందించిన ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్.ఇస్రో తన వందో రాకెట్ ప్రయోగం శ్రీహరికోట షార్ - సతీష్ ధావన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ నుండి చేపట్టిన నేపథ్యంలో సూళ్లూరుపేట పట్టణంలోని విద్యార్థినీ విద్యార్థులు సుమారు 500 మందిని గ్యాలరీనందు వీక్షించే విధంగా ఏర్పాటుతో, అలాగే తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ దంపతులు సైన్స్ ఫెయిర్ నందు అద్భుతమైన ప్రతిభ కనబరచిన సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.కె ఆఫ్రీద్ 9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ హిమ హన్షిని పదవ తరగతి విద్యార్థినిని ఇస్రో రాకెట్ ప్రయోగ వీక్షణకు తమతో పాటు తీసుకుని వెళ్లారు.

అబ్బురపరిచే విధంగా ఇస్రో తన వందో రాకెట్ నేటి బుధవారం ఉదయం తెల్లవారుజామున 6.23 గం.లకు షార్ శ్రీహరికోట నుండి గగనతలంలోకి విజయవంతంగా పంపిన కార్యక్రమాన్ని వారు వీక్షించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ డాక్టర్ వెంకటేశ్వర్, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ మరియు డైరెక్టర్ షార్ సైంటిస్ట్ ఎ.రాజరాజన్, శాస్త్రవేత్తల బృందానికి శుభాకాంక్షలు తెలిపి చైర్మన్ ,డైరెక్టర్ షార్ వారితో కలిసి ఫోటోలో పాలుపంచుకున్నారు. భారత కీర్తిని ప్రపంచ పటంలో ఉన్నత స్థానంలో నిలుపుతున్న ఇస్రో మరియు వారి బృందాన్ని కలెక్టర్ కొనియాడారు.



కంభం చెరువు అభివృద్ధి, విమానాశ్రయం, సంగీత - నృత్య కళాశాల ఏర్పాటుపై ముఖ్యమంత్రిని ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కలిశారు.



అటవీ ప్రాంతాన్ని కాపాడుకుంటూ, పచ్చదనాన్ని పరిరక్షిస్తేనే శ్రీరామరక్ష. అంతేకాదు.. వర్షాభావ పరిస్థితుల నుంచి కాపాడుకోవచ్చని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండ అటవీ రేంజ్ పరిధిలోని అధికారులు, సిబ్బందితో ఆంజనేయులు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అటవీ వనరులు, జీవ వైవిధ్యం విధ్వంసం కాకుండా సంరక్షించాలని కోరారు.



గుంటూరులోని డొంక రోడ్డు వద్ద రైల్వే శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న మూడు రైల్వే వంతెనల పనులను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. ఈ నిర్మాణాలు ఎప్పుడో పూర్తి కావాల్సి ఉన్నా ఇంకా పనులు జరుగుతూ ఉండటంపై అధికారులను వివరాల అడిగి తెలుసుకున్నారు. పనులు ఎప్పటికీ పూర్తవుతాయన్నది ప్రజలకు తెలిసేలా నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.



గుంటూరు జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన జాతీయ రహదారి భద్రతా మాస ఉత్సవాలు - 2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## శ్రీవారి లడ్డూ ప్రసాదాలకు కొత్త కవర్లు




**తిరుపతి, మహానాడు:** తిరుమలలో లడ్డూ ప్రసాద కేంద్రంలో పర్యావరణహిత లడ్డూ కవర్లను టీటీడీ అందుబాటులోకి తెచ్చింది. గతంలో ఓ ప్రైవేటు సంస్థ కవర్ల విక్రయాన్ని చేపట్టి టీటీడీకి అద్దె చెల్లించకుండా భారీగా లాభాలు ఆర్జించింది. కూటమి ప్రభుత్వంలో వీటిని గుర్తించి ఆ సంస్థ అనుమతులు రద్దు చేశారు. ప్రస్తుతం టీటీడీ ఆధ్వర్యంలో పర్యావరణహిత లడ్డూ కవర్ ఒకటి రూ.5కు, జనపనార బ్యాగ్ రూ.10కు అందుబాటు లోకి తీసుకువచ్చారు.

## ఏపీ కొత్త డీజీపీ హరీష్ కుమార్ గుప్తా!

◆ 31న రిటైర్ కానున్న ద్వారకా తిరుమలరావు



అమరావతి, మహానాడు: ఆంధ్రప్రదేశ్ నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ)గా హరీష్ కుమార్ గుప్తాను నియమిస్తూ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీజీపీ ద్వారకా తిరుమలరావు ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. 1992 బ్యాచ్‌కు చెందిన గుప్తా.. ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీగా ఉన్నారు.









## పిల్లలను కిడ్నాప్ చేసే ముఠా అరెస్టు

**నరసరావుపేట, మహానాడు:**

పల్నాడు జిల్లా, నరసరావుపేటలో చిన్నపిల్లలను కిడ్నాప్ చేసే ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నైలో యాచక వృత్తి ముసుగులో చిన్నారులను ఈ ముఠా కిడ్నాప్ చేస్తోంది. అంజమ్మ, వీరమ్మ, ఉమా, సరస్వతిలను అరెస్ట్ చేశారు. ఈనెల 12న సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో అసోంకు చెందిన సఖిబుద్దిన్‌ను వీరు కిడ్నాప్ చేశారు. సీసీ కెమెరాలతో నిర్ధారించి, పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాళ్ళు నరసరావుపేట, కొండకావూరు, ఎక్కలవారిపాలెం, యల్లమందలకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. కాగా, ఈ ముఠా అరెస్టుతో నరసరావు పేట ఉలిక్కిపడింది.



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

09


డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 30, జనవరి 2025 ‖

## యూవీ క్రియేషన్స్‌లో వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా యంగ్ అండ్ టాలెటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ ఓ సినిమా రూపొందిస్తున్న విషయం తెలిసిందే. వరుణ్ తేజ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఇండో-కొరియన్ హారర్ కామెడీ జానర్‌లో రానుంది. చవరుణ్‌తేజ్15 వర్కింగ్ టైటిల్‌తో వరుణ్ తేజ్ 15 సినిమాగా రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ వర్క్ వియత్నాంలో శరవేగంగా జరుగుతోంది. హీరో వరుణ్ తేజ్, డైరెక్టర్ మేర్లపాక గాంధీతో పాటు నిర్మాతలు వియత్నాంలో అద్భుతమైన లొకేషన్స్‌ను చూస్తున్నారు. అలాగే స్క్రిప్ట్ వర్క్ కూడా వేగంగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసి మార్చి మొదటి వారంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని భావిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. వరుణ్ తేజ్‌తో చేయబోతున్న ఈ సినిమా కోసం డైరెక్టర్ మేర్లపాక గాంధీ యూనిక్ స్టోరీలైన్‌ను డిజైన్ చేశారు. సరికొత్త జానర్‌తో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమా కోసం వరుణ్ తేజ్ ఇప్పటి వరకు కనిపించని సరికొత్త మేకోవర్‌తో స్క్రీన్‌పై మెస్మరైజ్ చేయనున్నారు.

## 'తండేల్'లో చైతన్యది కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్: అల్లు అరవింద్




యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, స్టార్ హీరోయిన్ సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. 'కార్తికేయ-2' లాంటి బంపర్ హిట్ కొట్టిన డైరెక్టర్ చందూ మొండేటి దర్శకత్వంలో సక్సెస్‌ఫుల్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రమోషన్స్ ఓ రేంజ్‌లో చేస్తున్న చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్‌ను వైజాగ్‌లోని రామా టాకీస్ రోడ్డులోని శ్రీరామ పిక్చర్ ప్యాలెస్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో లాంచ్ చేసింది. అభిమానుల మధ్య ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ వేడుకకు మెగా నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు హీరో అక్కినేని నాగచైతన్య హాజరయ్యారు. నాగచైతన్యకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. ట్రైలర్ విషయానికి వస్తే.. లవ్ స్టోరీ తర్వాత జంటగా వచ్చిన నాగచైతన్య, సాయిపల్లవి స్క్రీన్‌పై అదరగొట్టేశారు. నాగ చైతన్య, సాయి పల్లవి మధ్య అదిరిపోయిన కెమెస్ట్రీకి తోడు కాస్త దేశభక్తిని కూడా జోడించి డైరెక్టర్ చందూ మొండేటి ఈ సినిమాను భారీగా ప్లాన్ చేసినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఈ ఇద్దరి నోటా ఉత్తరాంధ్ర యాస బాగా పలికింది. తండేల్ అంటే లీడర్ అనే విషయాన్ని ఈ ట్రైలర్ ద్వారా తెలియజేశారు. 'రాజూ.. ఊళ్లో అందరూ మన గురించి ఏటేటో మాటాడుకుంటున్నారు రా' అనే సాయి పల్లవి డైలాగుతో ట్రైలర్ మొదలవుతుంది. వాళ్లు అనుకుంటున్నదే నిజం చేసేద్దామని ఆమె అనగానే ఇద్దరి లవ్ స్టోరీ మొదలవుతుంది. అయితే తరచూ చేపల వేటకు వెళ్లే అతడు.. ఆమెకు దూరమవుతూ ఉంటాడు. కానీ ఓసారి పాకిస్థాన్ సరిహద్దుకు వెళ్లి అక్కడే చిక్కుకుపోతాడు. అక్కడితో ట్రైలర్ కాస్తా లవ్ ట్రాక్ నుంచి దేశభక్తి వైపు వెళ్తుంది. మా దేశంలోని ఊరకుక్కలన్నీ ఉత్తరం వైపు తిరిగి పోస్తే.. ప్రపంచ పటంలో పాకిస్థాన్ లేకుండా పోతుంది.. మా యాసను మాత్రం ఎటకారం చేస్తే రాజులమ్మ జాతరే అని రెండు పవర్ ఫుల్ డైలాగులు చైతూ నోటి వెంట వినిపిస్తాయి. మొత్తం ట్రైలర్ ఒక పవర్ ప్యాక్డ్‌గా ప్రేక్షకులను తొలిరోజే థియేటర్లకు రప్పించేలా ఉంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన పోస్టర్స్, పాటలు అన్నీ కూడా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా విడుదలైన ట్రైలర్ అంచనాలను ఆకాశానికి పెంచేసింది.



## వరలక్ష్మీ శరత్ కుమార్, సంజీవ్ మేగోటి కాంబో

సీనియర్ నటుడు శరత్‌కుమార్ కూతురిగా వెండితెరకు పరిచయమైనా తన వైవిధ్యమైన నటన, విలన్ పాత్రలతో ఆకట్టుకుంటోంది వరలక్ష్మి. నటిగా సౌతిండియా భాషల్లో తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుని దూసుకుపోతోంది. ఈ క్రమంలో 'ఆదిపర్వం' మూవీ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వంలో ఓ తెలుగు సినిమా చేయబోతున్నట్టు సమాచారం. సంజీవ్ మేగోటి రాసుకున్న సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ సబ్జెక్టు కోసం వరలక్ష్మి శరత్ కుమార్ ఓకే చెప్పినట్టు తెలుస్తోంది. ఇందులో వరలక్ష్మి శరత్ కుమార్ మెయిన్ లీడ్ పాత్ర చేయనుంది. భారీ బడ్జెట్‌తో డైరెక్టర్ సంజీవ్ మేగోటి తెరకెక్కించనున్న ఈ సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులను తీసుకోబోతున్నారట. వరలక్ష్మి శరత్ కుమార్ మెయిన్ లీడ్‌గా సంజీవ్ మేగోటి తెరకెక్కించనున్న ఈ ప్రాజెక్టు ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. పూర్తి వివరాలు అతి త్వరలోనే ప్రకటించనున్నట్టు సమాచారం.



## విజయ్ ఆంటోనీ పరాశక్తి పోస్టర్

విభిన్న కథా చిత్రాలతో ఆకట్టుకుంటున్న విజయ్ ఆంటోనీ ఎప్పటికప్పుడు ఆడియన్స్ పల్స్ పట్టేస్తున్నారు. వినూత్న కథాంశాలతో వైవిధ్యభరితమైన పాత్రలతో అలరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు తన 25వ చిత్రాన్ని ఓ డిఫరెంట్ సబ్జెక్టుతో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. పరాశక్తి అనే పేరుతో ఈ సినిమా రాబోతోంది.

చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ఈ సినిమా టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. "అరువు", "వాజిల్" వంటి ప్రసిద్ధ చిత్రాలను రూపొందించిన ప్రముఖ దర్శకుడు, రచయిత అరుణ్ ప్రభు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విజయ్ ఆంటోనీ ఈ సినిమాలో అసాధారణమైన నటన, అంకితభావాన్ని ప్రదర్శించనున్నారట. ఈ చిత్ర టైటిల్ పోస్టర్ మరింత ఆకట్టుకోవడమే గాక, ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది. పరాశక్తి ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని అందించేందుకు మాస్ అప్పీల్, అత్యుత్తమ యాక్షన్, హృదయాన్ని హత్తుకునే కుటుంబ కథ ఎలిమెంట్స్ కలిగి ఉంది.

విజయ్ ఆంటోనీ ఫిల్మ్స్ కార్పొరేషన్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రాన్ని మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు.

## దీప ఆర్ట్స్ "ఏజెంట్ గై 001"

డేవిడ్ ఆండర్సన్ దర్శకత్వంలో ఎరిక్ ఆండర్సన్ నిర్మాతగా బాల్టాజర్ ఫ్లోటో, డేవిడ్ ఆండర్సన్ స్క్రీన్ ప్లే వహిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్న హాలీవుడ్ డబ్బింగ్ చిత్రం ఏజెంట్ గై 001. ఈ చిత్రానికి ఆంటోన్ క్లాడ్ జంపర్ గెస్టిన్ సంగీతాన్ని అందించగా డెన్నిస్ ఆండర్సన్ ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరించారు. ఆంటోన్ కార్ల్సన్ సినిమాటోగ్రాఫర్ గా పని చేశారు. బాల్టాజర్ ఫ్లోటో, ఆంటోనీ స్జొలండ్, మిల్టన్ బిజోర్న్‌గ్రెన్, నాట్ వెస్ట్ బ్యాక్, ఓమర్ మీర్జా కీలక పాత్రలో నటిస్తూ వస్తున్న ఈ చిత్రాన్ని తెలుగులో పి శ్రీనివాస గౌడ్ నిర్మిస్తూ సహాయ నిర్మాతగా పి హేమంత్ వ్యవహరిస్తూ దీప ఆర్ట్స్ బ్యానర్ ద్వారా జనవరి 31వ తేదీన ఎంతో ఘనంగా తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే తెలుగులో విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ చూస్తుంటే జేమ్స్ బాండ్ చిత్రాల తరహాలో వస్తున్న మరొక అద్భుతమైన యాక్షన్ అండ్ అడ్వెంచర్లు కలిగిన చిత్రంగా ఈ సినిమా ఉండబోతున్నట్లు అర్థమవుతుంది. చిత్రం ఎంత నాణ్యంగా ఉండబోతుంది అనేది టీజర్ లోని నిర్మాణం విలువలు ద్వారా చాలా క్లియర్ గా అర్థమవుతున్నాయి.



## రొమాంటిక్ థ్రిల్లర్‌గా "సంహారం"

గతంలో దాసరి, మోహన్ బాబు, జగపతిబాబు, శ్రీకాంత్ తదితరుల వద్ద వందకు పైగా సినిమాలకు స్టిల్ ఫోటోగ్రాఫర్ గా పనిచేసిన ధర్మ ఇప్పుడు మెగా ఫోన్ పట్టారు. రత్న మేఘన క్రియేషన్స్ పతాకంపై దర్శక, నిర్మాతగా ఆయన తెరకెక్కించిన చిత్రం "సంహారం". ఆదిత్య, కవిత మహతో హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను సైతం పూర్తి చేసుకుని ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్



హైదరాబాద్ లోని ఫిలిం ఛాంబర్‌లో జరిగింది. చిత్రం పాటలను, ప్రోమోస్ ను ప్రదర్శించారు. దీనికి అతిథిగా విచ్చేసిన ప్రముఖ దర్శకుడు రాజా వన్నెంరెడ్డి మాట్లాడుతూ, "గురువు దాసరి కాంపౌండ్ లో పలు చిత్రాలకు ధర్మ పనిచేయడం వల్ల నాకు పరిచయం ఉంది. చిత్రపరిశ్రమలోని ఆటుపోట్లను సుదీర్ఘ అనుభవంలో అర్థం చేసుకుని, అవహగాన చేసుకున్న టెక్నీషియన్ ధర్మ ఈ చిత్రం ద్వారా దర్శక, నిర్మాతగా మారడం అభినందనీయం. పాటలు, ప్రోమోస్ చాలా బావున్నాయి" అని అన్నారు. దర్శక, నిర్మాత ధర్మ మాట్లాడుతూ, "రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఒక అమ్మాయి తనకు, తన అక్కకు అనుకోని ఘటనలు ఎదురైనపుడు తను నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ తో దుష్టులను ఎలా ఎదుర్కొంది అన్న పాయింట్ తో ఈ సినిమాను మలిచాం.



## భూపేంద్ర పటేల్‌ను కలిసిన మోహన్ బాబు, విష్ణు మంచు

లెజెండరీ నటుడు మోహన్ బాబు గారు, డైనమిక్ స్టార్ విష్ణు మంచు ప్రస్తుతం 'కన్నప్ప' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ క్రేజీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ కన్నప్ప పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలతో పాటుగా ప్రమోషన్స్ కూడా సమాంతరంగా జరుగుతున్నాయి. ఈ ప్రమోషనల్ టూర్‌లో భాగంగా కన్నప్ప టీమ్ దేశవ్యాప్తంగా ద్వాదశ జ్యోతిర్లింగాలను సందర్శిస్తోంది. ఈ క్రమంలో మోహన్ బాబు, విష్ణు మంచు గుజరాత్ ముఖ్యమంత్రి గౌరవనీయులైన శ్రీ భూపేంద్ర పటేల్ ని కలిశారు. ఈ టూర్‌లో శరత్ కుమార్, ముఖేష్ రిషి, వినయ్ మహేశ్వరి కూడా సందడి చేశారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ అతిథి మర్యాదలకు, పలికిన సాదర స్వాగతాలకు కన్నప్ప టీం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ప్రముఖ తెలుగు కళాకారుడు రమేష్ గొరిజాల అందమైన పెయింటింగ్‌ను విష్ణు మంచు ముఖ్యమంత్రికి బహుకరించారు. కన్నప్ప చిత్రం ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోన్న సంగతి తెలిసిందే.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144